

సుపరిపాలన కోసం...

అందరికి ఎదిగే అవకాశాల కోసం...

# సురాజ్య ఉద్యమం

డి.వి.వి.యస్. వర్మ

# సురాజ్య ఉద్యమం ఎందుకు ?

I. **రాయితీల బతుకు కన్నా, ఎదిగే అవకాశాలే మిన్న**

సుపరిపాలన కోసం సురాజ్యం ఉద్యమం. సుపరిపాలన అంటే...

ఎ) పుట్టిన ప్రతి బిడ్డకీ, డబ్బుతో, కులంతో, పేదరికంతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాల విద్యతో ఎదిగే అవకాశాలు కల్పించడం.

బి) డబ్బు కారణంగా తగిన వైద్యం అందక ఏ వ్యక్తి మరణించకూడదు. కుటుంబాలు అప్పుల పాలు కాకూడదు.

సి. యువతకు చదువుకు తగ్గ ఉపాధి, ఉపాధికి తగిన నైపుణ్యాలతో ఎదిగే అవకాశాలు కల్పించాలి. నిరుద్యోగ భృతికి చేతులు చాపే యాచకులు కాకుండా వారిని సంపాదనా పరుల్ని చెయ్యాలి.

డి) వ్యవసాయం లాభసాటి వృత్తి కావాలి. రాయితీల చుట్టూ కాకుండా లాభసాటి ధరల చుట్టూ తిరిగే ఏర్పాట్లు చెయ్యాలి.

ఇ) పేదలకు, చేతివృత్తులకీ జీవనభద్రత కల్పించాలి.

II **పౌరులు కేంద్రంగా పాలన**

ప్రజలు నివసించే చోట పాలన వుండాలి. పంచాయితీలు, మున్సిపాలిటీలు స్థానిక ప్రభుత్వాలు కావాలి. అందరికీ గృహవసతి, శుద్ధి చేసిన మంచినీరు, ఈగలు, దోమలు లేని పారిశుధ్యం, 24 గంటలు గృహ విద్యుత్ వుండాలి. చదువులు చెప్పే పాఠశాలలు, వైద్యసేవలు అందించే ఆరోగ్య కేంద్రాలు, యువతకి ఉపాధి శిక్షణ, రైతులకి వ్యవసాయ విజ్ఞానం ఎక్కడ కక్కడే అందుబాటు కావాలి.

III **హక్కుగా పౌరసేవలు**

లంచాలు, సిఫారసులు లేకుండా నిర్దిష్ట గడువులోగా ప్రభుత్వ కార్యాలయాలలో సేవలని ప్రజలు హక్కులుగా పొందాలి. పౌరసేవల హక్కు చట్టం తేవాలి

IV **కొత్త లోకాయుక్త చట్టం రావాలి**

అవినీతిపరుల భరతం పట్టగల అధికారాలతో కోరలు గల కొత్త లోకాయుక్త చట్టం రావాలి.

V **డబ్బు సంచుల చుట్టూ తిరగని ఎన్నికల వ్యవస్థ**

ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం కల్పించడానికి, డబ్బు మద్యం ప్రభావం తగ్గించడానికి దామాషాపద్ధతి ఎన్నికల వ్యవస్థ రావాలి.

**ఇవీ... సురాజ్య ఉద్యమానికి కొన్ని ముఖ్య లక్ష్యాలు**



## సుపరిపాలన కోసం
## అందరికి ఎదిగే అవకాశాల కోసం

# సురాజ్య ఉద్యమం

డి.వి.వి.యస్. వర్మ

# పునఃసమీక్షకు సమయం

"ఏ సమాజంలో అయితే నీతి తప్పినవారు విజయం సాధిస్తారో

ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో

ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో

ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా

'తమకు కావలసిన' వాటా కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో

అక్కడ

వ్యవస్థకు సంబంధించిన పునఃసమీక్షకు

సమయం ఆసన్నమైందని అర్థం

అప్పుడు తమ గురించి, తమకు సంబంధించినవారి గురించి

తమ చుట్టూరా వున్న వారి గురించి

తమ కార్యకలాపాలకు సంబంధించి

అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"

– రాబర్ట్ క్లిట్‌గార్డ్

ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త

# విషయసూచిక


1. సురాజ్య ఉద్యమం...ఎవరి కోసం ? ఎందుకోసం ? 4

2. ఇంటి ముందు ప్రభుత్వం – కంటి ముందు పాలన 12

3. హక్కుగా ప్రభుత్వ సేవల చట్టం కావాలి 16

4. అవినీతి భరతం పట్టే కొత్త లోకాయుక్త 21

5. దామాషా పద్ధతి ఎన్నికలే మిన్న 27

6. రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం 32

7. అనుబంధాలు – గణాంకాలు

ఎ) ఆంధ్రప్రదేశ్ సంగ్రహస్వరూపం 39

బి) జిల్లాలవారీ జనాభా, స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం 40

సి) ఇతర వివరాలు 41

డి) రాష్ట్రంలో కుటుంబాలు – వసతులు 2011 42

ఇ) రాష్ట్రంలో పాఠశాల విద్య 44

ఎఫ్) రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యసేవలు 45

జి) పంచాయితీలు, మున్సిపాలిటీలకు రాజ్యాంగపరంగా దఖలుపర్చాల్సిన అంశాలు 47



**FDR and Lok Satta publication**

**2012, Hyderabad**




**H.No. 806, 8th Floor, Srinivasa Towers,**
**Beside ITC Kakatiya Hotel, Begumpet, Hyd-16**
**Ph: +91-40-2341 9949, Fax: +91-40-2341 9948**
**Email : info@fdrindia.org**
**Web : www.fdrindia.org**

# సురాజ్య ఉద్యమం
## ఎవరి కోసం ? ఎందుకోసం?

### 1. సురాజ్య ఉద్యమం ఎవరి కోసం ?

సురాజ్యం మనకోసం, మీ కోసం, నాకోసం. ఇది మనందరి ఉద్యమం. సుపరిపాలన కోసం సాగించే ఉద్యమం ఇది. సుపరిపాలన అంటే మంచిపాలన. ప్రజల మంచికోరే పాలన. మన బతుకుల్ని మార్చేపాలన. అందరికీ ఎదిగే అవకాశాలను అందించే పాలన. ఎదిగే అవకాశం, బతికే అవకాశం ఒకటి కాదు. ఈ రెండూ వేర్వేరు అంశాలు. ప్రస్తుతం నడుస్తున్న రాజకీయం బతికే అవకాశాన్ని కల్పించడం మాత్రమే లక్ష్యంగా పెట్టుకుంది. లక్కపిడతల్లాంటి ఇళ్లు, నెలకి నాలుగు కిలోల బియ్యం, ఒక లీటరు కిరసనాయిలు వగైరా సంవత్సరానికి 100 రోజుల పని పథకంతో ఇదే స్వర్గంగా బతకమంటున్నది.

స్వర్గం అంటే సురాపానం కూడా వుండాలి గదా! అందుకే మద్యాన్ని ఏరులుగా పారిస్తున్నారు. పేదల జీవితాల చుట్టూ మద్యం ఉచ్చు బిగిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీకంటే, సంక్షేమం కంటే ఎక్కువ మొత్తాన్ని తిరిగి గుంజు కుంటున్నారు. ఈ రాజకీయం ప్రజల్ని శాశ్వతం గా బీదరికం లో వుంచింది. వాళ్లని యాచకులుగా మార్చింది. ప్రతి దానికి ప్రభుత్వం మీద ఆధారపడేలా చేసింది. ఇలా ఓటు బ్యాంకు రాజకీయం సాగిపోతున్నది. సంప్రదాయ రాజకీయ పార్టీలన్నీ ఈ తరహా రాజకీయాన్ని ఎంచుకుని, పోటీ పడుతున్నాయి. ఇది



బతుకు రాజకీయం. మనకి ఎదిగే అవకాశాలిచ్చే రాజకీయం కావాలి. స్వతంత్ర జీవనాన్ని, ఆత్మ గౌరవాన్ని ఇచ్చే రాజకీయం కావాలి. మన బిడ్డల బతుకు కూడా మనలాగే కాకుండా వారికి మంచి భవిష్యత్తునిచ్చే రాజకీయం కావాలి. అందుకే ఈ సురాజ్య ఉద్యమం.

పుట్టిన ప్రతి బిడ్డకీ కులంతో, డబ్బుతో నిమిత్తం లేకుండా ఎదిగే అవకాశాలు వుండాలి. డబ్బులేని కారణంగా ఏ బిడ్డ చదువూ మధ్యలో ఆగిపోకూడదు. ఉన్నవాళ్లకో చదువు, లేనివాళ్ళకో చదువు అన్న అంతరం పోవాలి. అందరికీ మంచి ప్రమాణాల చదువు అందించే ఏర్పాటు జరగాలి. ఇదీ ఎదిగే అవకాశాలనిచ్చే రాజకీయం.

సకాలంలో సరైన వైద్యం అందక ఏ వ్యక్తీ మరణించకూడదు. మంచి వైద్యసేవల కోసం కుటుంబాలు అప్పులపాలు కాకూడదు. ఉన్నవాళ్లకి మంచి వైద్యం లేనివాళ్లకి నాసివైద్యం అన్న అంతరం పోవాలి. అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల వైద్యం అందాలి. అప్పుడే అది సుపరిపాలన అనిపించుకుంటుంది.

యువతకు మంచి భవిష్యత్తును ఇవ్వాలి. చదువుకు తగ్గ నైపుణ్యాలు, ఉపాధికి ఏర్పాట్లు చెయ్యాలి. వాళ్లని సంపాదనాపరుల్ని చెయ్యాలి. నిరుద్యోగభృతి కోసం చేతులు చాపేవారిగా దిగజార్చకూడదు.



ప్రస్తుత రాజకీయం వారిని నిరాశలో ముంచు తున్నది. అసంతృప్తిని, అసహనాన్ని పెంచు తున్నది. యువత తమ భవిష్యత్తు గురించి కలలు కనేలా విశ్వాసాన్ని నింపాలి. ఆ కలలను సాకారం చేసుకునే అవకాశాలు కల్పించే పాలన అందించాలి. కొత్త తరానికి కొత్త రాజకీయం అంటే ఇదే.

మన రైతులు, కౌలుదారులు పంటలు పండిస్తున్నారు. వారిని నష్టాలలో ముంచి, అప్పులపాలు చేసి ఆత్మహత్యల వైపు నెడుతున్నది పాత రాజకీయం. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పావలా వడ్డీలు, బీమా పథకాలు, మద్దతు ధరల పేరుతో ఎంతగా ప్రభుత్వాలు మభ్యపెట్టాలని చూస్తున్నా, ఆచరణలో రైతులకు నష్టాల మంట తప్ప లాభాల పంట రావడం లేదు. ఇలాంటి రాజకీయం సాగినంతకాలం రైతులు ఎంత గింజుకున్నా వ్యవసాయం లాభసాటి కాదు. వ్యవసాయాన్ని ఒక లాభసాటి పరిశ్రమగా పరిగణించాలి. వారికి ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛనివ్వాలి. ఎగుమతి, దిగుమతి వ్యాపారాన్ని రైతులకు అనుకూలంగా మార్చాలి. కో ఆపరేటివ్‌లను, మార్కెట్‌యార్డులను రైతులపరం చెయ్యాలి. మధ్యదళారుల వ్యవస్థను కుదించాలి. అవి రైతులకు స్వంత మార్కెట్లను కల్పించే సాధనాలు కావాలి. ప్రభుత్వ సబ్సిడీలు రైతులకు నేరుగా దక్కాలి. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులను తేవాలి. పంటల నిల్వలకు, రవాణాకు విలువను పెంచే అనుబంధ పరిశ్రమలకు ద్వారాలు తెరవాలి. ఇది జరగాలంటే పాత రాజకీయం పోవాలి. కొత్త రాజకీయం రావాలి. అందుకే సురాజ్య ఉద్యమం.

ఆధునిక యుగంలో అభివృద్ధికి అత్యంత కీలకమైంది విద్యుత్తు. ఇది అందరికీ తెలిసిందే. అయినా రాష్ట్రంలో అంధకారంలో ఇళ్లు, మూతపడుతున్న పరిశ్రమలు, ఎండిపోతున్న పొలాలు, నిత్యకృత్యాలయ్యాయి. ఈ విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వాలు, వాటి పాత రాజకీయం తప్ప వేరు కారణం లేదు. అవసరాలకు తగిన విద్యుత్తు కోసం ముందుచూపులేకపోవడం, ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు జమాఖర్చులు లేకపోవడం, విద్యుత్‌రంగంలో అవినీతిని, దుబారాను, దొంగతనాన్ని అరికట్టలేని అసమర్థత, ఇదే పాత రాజకీయం తంతు అయింది. వినియోగదారుల ధరల భారాన్ని పెంచడం తప్ప ఈ సంక్షోభం నుండి బైటపడే సంస్కరణల మీద ధ్యాస పెట్టే సత్తా ఈ రాజకీయానికి లేదు. విద్యుత్తు లేకుండా అభివృద్ధి వుండదు. ఉపాధి వుండదు.

సుఖశాంతులనిచ్చే జీవితం వుండదు. ప్రజల భవిష్యత్తును అక్షరాల అంధకారంలో ముంచేది దుష్పరిపాలన అవుతుంది. పరిష్కరించేదే సుపరిపాలన అవుతుంది. ఇలా వివిధ తరగతుల ప్రజలకి ప్రత్యేకించి బడుగు, బలహీన వర్గాలకి, మహిళలకి, పట్టణాలలో నివసించే మధ్య తరగతికి, కార్మికులు, ఉద్యోగులు, చేతివృత్తులకీ, రకరకాల సమస్యలున్నాయి. వాటిని పెంచి పెద్ద చేసే రాజకీయమే గాని, పరిష్కరించే రాజకీయం లేదు.

ఇక్కడ బతకడానికి – ఎదగడానికి మధ్య వున్న తేడాని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఇన్ని రకాల వ్యవసాయ పంటలు లేకపోయినా కందమూలాలతో మనం బతకవచ్చు. ఆధునిక వైద్యసదుపాయాలు లేకపోయినా పసరువైద్యాలతో కాలం వెళ్లబుచ్చవచ్చు. చదువు లేకపోయినా బతకొచ్చు. విద్యుత్ లేకపోయినా, దీపం లేకపోయినా బతకొచ్చు. పరిశ్రమలు, రకరకాల వస్తువులు లేకపోయినా బతకొచ్చు. పుస్తకాలు, సాహిత్యం, సంగీతం, కళలు లేకపోయినా బతకొచ్చు. ఇలాంటిదే బతుకైతే ఆధునిక మానవులకి, ఆదిమానవులకి తేడా వుండదు. జంతుజాలంలో ఒకరుగా బతకొచ్చు. ఇది బతుకు కాదు. అలా జీవించకూడదు. మనం పైకి, ఇంకా పైకి ఎదగాలి – ఎదిగే అవకాశాలను పెంచుకోవాలి. మరింత సుఖంగా, మరింత ఆనందంగా జీవించాలి. అలా ఎదిగే అవకాశాల కోసం, పరిపూర్ణమైన జీవనాన్ని పొందడానికే సురాజ్య ఉద్యమం.

**2. ప్రజలు గ్రామాలలో, పట్టణాలలో నివసిస్తున్నారు. ఇవి నివాసయోగ్యంగా వుండాలి.**

పాఠశాల చదువు, ప్రాథమిక ఆరోగ్యం, సంక్షేమపథకాల అమలుతోపాటు అందరికీ గృహవసతి, శుద్ధి చేసిన మంచినీరు, మరుగుదొడ్లు, మురుగుపోయే ఏర్పాట్లు, రోడ్లు, లైట్లు, రవాణా సదుపాయాలు, కోతలు లేని విద్యుత్తు వగైరాలు లేకపోతే జీవనం దుర్భరం అవుతుంది. కాని మనకి అవసరాలు ఒకచోట, పాలన మరొక చోట వున్నది.


మనం నివసించే చోట వున్న సమస్యలకి అక్కడే తక్షణ పరిష్కారాలు వుండాలి. ఇది జరగాలంటే పాలన ఢిల్లీ నుండి, హైదరాబాదు నుండి గ్రామాలకు పట్టణాలకు బదిలీ కావాలి. పంచాయితీలు, మున్సిపాలిటీలు స్థానిక ప్రభుత్వాలు కావాలి. ప్రజల

సొమ్ము వారి అసవరాల కోసం, వారి కళ్లముందు ఖర్చు జరిగే ఏర్పాటు జరగాలి. ఈ స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, సిబ్బందిని బదలాయించాలి. గ్రామస్వరాజ్యం లేకుండా పూర్ణస్వరాజ్యం కాదని గాంధీజీ అన్నారు. ప్రస్తుత కేంద్రీకృతపాలనని మనం వదిలించుకోవాలి. స్థానిక స్వపరిపాలన సాధించాలి. అందుకే సురాజ్య ఉద్యమం.

## 3. హక్కుగా ప్రభుత్వ సేవలు

ప్రభుత్వం కార్యాలయాలు ప్రజల పన్నుల సొమ్ముతో నడుస్తున్నాయి. అందుచేత పాలనా సంస్థలు ప్రజలకు జవాబుదారీగా వుండాలి. ప్రజలకు హక్కుగా సేవలు అందాలి. అవినీతి లేకుండా, సకాలంలో అందాలి. ఇలాంటి సేవల కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం, బ్రోకర్లను ఆశ్రయించడం, రాజకీయ సిఫారసులు చేయించడం, లంచాలు ఇవ్వడం వగైరాలతో నిమిత్తం లేకుండా చెయ్యాలి.

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వారు అందించే సేవలకు సిటిజన్స్ ఛార్టర్లు ప్రకటించాలి. నిర్దిష్టమైన గడువు వుండాలి. గడువు మీరితే జరిమానాలు, పరిహారాలు ఇచ్చే ఏర్పాటు వుండాలి. వీటి అమలుకు బాధ్యత వహించే నిర్దిష్టమైన ఏర్పాటు



వుండాలి. తుది అప్పీలు చేసుకోడానికి స్వతంత్ర ప్రతిపత్తి గల ఆంబుడ్స్‌మన్ వ్యవస్థ వుండాలి.

ప్రస్తుతం రాష్ట్రంలో సిటిజన్స్ ఛార్టర్లు, బోర్డులు తప్ప అమలు చేసే ఏర్పాటు లేదు. వీటిని హక్కుగా పొందడానికి చట్టబద్ధత లేదు. దేశంలో 14 రాష్ట్రాలలో సేవలు పొందే హక్కుని చట్టబద్ధం చేశారు. మనరాష్ట్ర ప్రభుత్వం చట్టం చెయ్యడానికి బదులు "ఈసేవ" "మీ సేవ" పేరుతో తప్పించుకోవాలని చూస్తున్నది. పౌరసేవలు హక్కుగా పొందే చట్టం వచ్చితీరాలి. ఈ చట్టాన్ని సాధించడం సుపరిపాలనలో ఒక ముందడుగు అవుతుంది.

## 4. పాలనలో అవినీతిని తొలగించడం

ప్రజాప్రతినిధులలో, పాలనాధికారుల్లో అవినీతి పెచ్చరిల్లుతున్నది. ప్రస్తుతం మన రాష్ట్రం అవినీతిలో అగ్రస్థానంలో వుంది. ఈ అవినీతి అభివృద్ధికి ఆటంకంగా మారింది. ప్రాజెక్టులు, రోడ్లు, నిర్మాణాలు, ప్రభుత్వ పధకాలు అన్నింటా అవినీతి తాండవిస్తున్నది. మరోపక్క అధికారాన్ని అడ్డంపెట్టుకుని భూకబ్జాలు, గనులు, సహజవనరుల దోపిడీ సాగిపోతున్నది. ఇలా ప్రజల సొమ్మును కొల్లగొట్టి, సహజసంపదను లూటీ చేసి నెలల్లో, సంవత్సరాల్లో వందల వేలకోట్లు దోచుకుంటున్నారు. అందరి అభివృద్ధికీ, ఎదిగే అవకాశాలకు ఈ తరహా అవినీతి అవరోధం అయింది.

ఇలాంటి అవినీతిపరుల భరతం పట్టే వ్యవస్థను మనం సాధించుకోవాలి. ప్రస్తుతం మనకి లోకాయుక్త ఉపలోకాయుక్తలు వ్యవస్థ వున్నప్పటికీ అది అవినీతిని నిరోధించే అంకుశంగా లేదు.

అవినీతి ఆరోపణలు, అభియోగాలపై తనంతట తానుగా ప్రాధమిక విచారణ జరిపే అధికారం, స్వతంత్రప్రతిపత్తి గల నేర పరిశోధన విభాగం, కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు, స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాసిక్యూషన్ ఏర్పాటు అక్రమ ఆస్తులు జప్తు చేసే అధికారం... ఇలా కోరలు గల కొత్త లోకాయక్త చట్టాన్ని రాష్ట్రంలో సాధించాలి. అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలి. ఎంతటివారినైనా శిక్షించే ఏర్పాటు జరగాలి. ఇది రాష్ట్రంలో సుపరిపాలనకు మరోమెట్టు అవుతుంది.

## 5. స్వాహారాజ్యం అంతం కోసం...



రాష్ట్రంలో సుపరిపాలన లేకపోవడానికి అసలు కారణాలు సంప్రదాయ పార్టీల రాజకీయంలో, ఆ పార్టీల పనితీరులో, మన ఎన్నికల వ్యవస్థలో వున్నాయి.


ఒక్క ఓటు మెజారిటీతో గెలుపు సాధించే ఎన్నికల వ్యవస్థను (ఎఫ్.పి.టి.పి) మనం ఎంచుకున్నాం. స్థానికంగా గెలుపు సాధించడానికి ఎన్నికల్లో కోట్లు గుమ్మరించడం, మద్యం పారించడం, ఓటుబ్యాంకు రాజకీయాలు అనుసరించడం అన్నీ ఈ ఎన్నికల వ్యవస్థ నుండి ఉత్పన్నమైనవే. ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత తిరిగి కోట్లు సంపాదించడమే రాజకీయ లక్ష్యం అయింది. అవినీతి పునాది మీదే ఎన్నికల వ్యవస్థ, రాజకీయ పక్షాలు, ప్రజా ప్రతినిధులు వ్యవహరించాల్సిన విషవలయాన్ని సృష్టించారు. ఈ విషవలయం సృష్టికి వారు ఎంత బాధ్యులో వారే అంత బాధితులు కూడా. ఈ విషవలయం నుండి బయటపడే మార్గాలు అన్వేషించకుండా అందులోనే సంప్రదాయ పార్టీలు పోటీపడుతున్నాయి.

దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థ తప్ప దీనికి పరిష్కారం మరొకటి లేదు. చిల్లర సంస్కరణలకు బదులు కొత్త ఎన్నికల వ్యవస్థను తెచ్చుకోవాలి. ఈ పద్ధతి నిజాయితీ రాజకీయాన్ని పెంచుతుంది. డబ్బు ప్రభావాన్ని తగ్గిస్తుంది. ప్రతి ఓటుకీ విలువనీ, ప్రాతినిధ్యాన్ని కల్పిస్తుంది.

ఇక రాజకీయ పార్టీలు పూర్తిగా వ్యక్తుల చుట్టూ, కుటుంబాల చుట్టూ, వారసత్వాల చుట్టూ తిరిగే వ్యవస్థలుగా మారాయి. పార్టీలు వీరికి కేవలం అధికార సాధనాలు తప్ప ప్రజల ఆకాంక్షల్ని పెంచి, సమాజహితం కోసం పోరాడే సాధనాలు కాకుండా పోయాయి. విధానాల చుట్టూ సాగాల్సిన సంఘర్షణ వ్యక్తుల చుట్టూ తిరుగుతున్నది. ఈ పార్టీలు ఇలా మారడానికి పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం దోహదం చేసింది. పార్టీలో సభ్యుల సాధికారతను లేకుండా చేశారు. అభ్యర్థుల ఎంపికలో

పాత్రధారుల్ని లేకుండా చేశారు. పార్టీలు స్వప్రయోజన సాధనాలుగా ఉన్నంతకాలం ఇలాంటి రాజకీయమే నడుస్తుంది. రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, సభ్యుల సాధికారతను, జమాఖర్చులలో పారదర్శకతలను పెంపొందించడానికి " పార్టీల చట్టం" తప్పనిసరి. ప్రజలు ఏ సంఘం పెట్టుకోవాలన్నా వాటికి చట్టాలున్నాయి. యువజన సంఘం పెట్టుకోడానికి సొసైటీల చట్టం, కో ఆపరేటివ్‌లు పెట్టుకోడానికి సహకార చట్టం, కార్మిక సంఘాలు పెట్టుకోడానికి ట్రేడ్ యూనియన్ చట్టం ఇలా అన్ని రంగాలకీ చట్టాలున్నాయి. కాని చట్ట సభలకు ప్రతినిధుల్ని పంపించే పార్టీలకు మాత్రం చట్టం లేకపోవడం కంటే వింత మరొకటి వుండదు. అలాంటి చట్టం సంప్రదాయ పార్టీల పనితీరును మారుస్తుంది. ప్రయివేటు ఎస్టేట్లుగా వున్న పార్టీలను సమాజహితం కోసం పోరాడే సాధనాలుగా మారుస్తుంది.

ఇవన్నీ సాధిస్తే సుపరిపాలన వస్తుంది. సురాజ్యం వైపు అడుగులు పడతాయి. ఇది ప్రజల కోసం ప్రజలు నిర్వహించుకునే ఉద్యమం కావాలి. మన తలరాతల్ని మనమే తిరగరాసుకోవాలి. ఈ రాజకీయాన్ని మార్చాలి. సమాజహితం కోసం పోరాడే కొత్త రాజకీయాన్ని, సాధించుకోవాలి. అప్పుడే సుపరిపాలన – అప్పుడే సురాజ్యం. ◆




# ఇంటి ముందు ప్రభుత్వం, కంటి ముందు పాలన

## పంచాయితీలు, మున్సిపాలిటీలు స్థానిక ప్రభుత్వాలు కావాలి

ప్రజలు నివసించేది గ్రామాలలో లేదా పట్టణాలలో, ఈ ప్రజలే పన్నులు కట్టి ఖజానాకు సొమ్మును ఇస్తున్నారు. దానిని ఖర్చు చెయ్యడానికి తమ ఓటుతో ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వాలకు అధికారాల్ని ఇస్తున్నారు. వారు ఢిల్లీ నుండి, హైదరాబాద్ నుండి పాలన సాగిస్తున్నారు. పధకాలు వేస్తున్నారు. లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయినా ప్రజలు నివసించే చోట తగిన వసతులు వుండడం లేదు. మౌలిక అవసరాలు తీరడం లేదు. మన పట్టణాలు మురికికూపాలు అవుతున్నాయి. మన గ్రామాలు ఎదుగూ బొదుగూ లేక కునారిల్లుతున్నాయి.

గ్రామాలకీ, పట్టణాలకీ పంచాయితీలను, మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. వాటికి విధులను నిర్దేశించారు. కాని నిధులిచ్చే నాధుడు లేడు. అధికారాలిచ్చే ధ్యాసలేదు. అవి స్థానిక ప్రభుత్వాలుగా లేవు. కేవలం ఉత్సవ విగ్రహాల్లా వున్నాయి. ప్రభుత్వ పధకాలు అమలు చేసే ఏజన్సీలుగా వున్నాయి. ప్రజల అవసరాలు తీర్చేవిగా లేవు. డబ్బు పోయే శనీపట్టినట్టుగా ప్రజల బతుకు తయారైంది.




- ♦ తాగడానికి పనికొచ్చే మంచినీరు అందించడం ఈ స్థానిక ప్రభుత్వాల విధి. కాని ఎక్కడా శుద్ధి చేసిన మంచినీటికి గ్యారంటీ లేదు. పేదలు, సామాన్యులు ఈ నీళ్లే తాగి రోగాలు తెచ్చుకుంటున్నారు. ఒక పక్క మంచినీటికి పన్ను కడుతూనే మరో పక్క చాలామంది నెలకు దాదాపు రూ॥1000/- డబ్బా మంచినీళ్లకు ఖర్చుపెడుతున్నారు.
- ♦ మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించడం వాటి విధి. మురికి కాల్వల నిర్వహణలో, చెత్తా చెదారం తొలగింపులో అలసత్వానికి ప్రజల అనారోగ్యం పాలౌతున్నారు. దోమల వీరవిహారం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. పేదలు, సామాన్యులు ఈ దోమలతో సహజీవనం చేస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. మరొక పక్క మధ్యతరగతి ఈ దోమల పీడ వదిలించుకోడానికి ప్రతినెలా రూ॥100 నుండి 150 రూపాయలు వరకు కాయిల్స్‌మీద, మ్యాట్స్‌మీద జేబులోంచి ఖర్చు చేస్తున్నారు.
- ♦ రోడ్లు, వీధి దీపాల నిర్వహణ ఈ స్థానిక ప్రభుత్వాల బాధ్యత. కాని ప్రతిచోట కరెంటుకోతలతో అనేక ప్రాంతాలు చీకట్లోనే వుంటున్నాయి. గోతులు, గుంటల రోడ్లతోనే వుంటున్నాయి. కొత్త కాలనీలలో పరిస్థితులు దుర్భరంగా వున్నాయి. ఈ చీకటిలో దొంగలు ఘరానాగా సంచరిస్తున్నారు. యజమానులు దొంగల్లా ఇళ్లు చేరుతున్నారు.
- ♦ పంచాయితీలు, మున్సిపాలిటీలలో ప్రభుత్వ పాఠశాలలు వున్నా అక్కడ చదువు వస్తుందన్న నమ్మకం ఎవరికీ లేదు. గతిలేని వాళ్ళకి గవర్నమెంటు స్కూళ్లు దిక్కయితే, మిగిలిన వాళ్ళు జేబులో డబ్బు పెట్టి పిల్లలకు చదువును కొంటున్నారు.
- ◆ ఆరోగ్య కేంద్రాలలో మందుల్లేవు, డాక్టర్లు, సిబ్బంది లేక వైద్యసేవలు అందించే స్థితిలో లేవు. రోజువారీ జబ్బులకు వైద్యానికి వేల రూపాయలు వదిలించుకుంటున్నారు. చాలామంది అప్పులపాలవుతున్నారు. - ఆస్తులు అమ్ముకుని నిరుపేదలవుతున్నారు.
- ◆ కొద్దిపాటి చదువు వున్న యువతకు ఉపాధికి తగ్గ నైపుణ్యాలు లేక ఇతర సంపాదనామార్గాలు లేక నిరాశకు గురౌతున్నారు.
- ◆ రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించే ఏర్పాటు లేదు - పంటల సరళిని,

మార్కెట్ సరళిని తెలుసుకునే మార్గం లేదు. పంట నిల్వ చేసుకునే ఏర్పాటు, అదనపు విలువ సమకూర్చే అవకాశాలు లేవు.

ఇలా అన్ని తరగతుల ప్రజలకీ నివసించే చోట నిత్యం అన్నీ సమస్యలే. ఇవన్నీ ఎక్కడికక్కడ పరిష్కరించదగినవే. పరిష్కరించే పాలన ప్రజల ముంగిట లేదు. ప్రజలు గ్రామాలలో, పట్టణాలలో వుంటే పాలన ఢిల్లీలో, హైదరాబాద్‌లో వుంది. అధికారాలు కలెక్టర్ల దగ్గర, ముఖ్యమంత్రుల దగ్గర కేంద్రీకృతమైంది. ఎక్కడికక్కడ పరిష్కారం దొరికే సమస్యలకు ఢిల్లీ చుట్టూ, హైదరాబాద్ చుట్టూ, జిల్లా కేంద్రం చుట్టూ ప్రదక్షిణాలు చెయ్యడం నిత్యకృత్యం అయింది. అయినా పరిష్కారమయ్యేది గోరంత, పేరుకు పోయేది కొండంత అవుతూనే వుంది.

అధికారం దూరం కావడంతోపాటూ సొమ్ము దూరం అయింది. ప్రజల పన్నుల సొమ్ము ఢిల్లీకి పోతున్నది. హైదరాబాద్‌కు పోతున్నది. అక్కడ వాళ్లు పథకాల రూపంలో వదిలిస్తున్నారు. వాటితోనే ప్రజలు సంతృప్తి పడాల్సివస్తున్నది.

ప్రజల పన్నుల సొమ్ములో ఒక వాటా వారి కళ్లముందు వారి అవసరాల కోసం ఖర్చుకావాలి. ఈ వాటా సొమ్మును ఖర్చుచేసే అధికారం గ్రామాలలో, పట్టణాలలోనే వుండాలి. అది జరగడం లేదు. ఒక వికృతమైన కేంద్రీకృతపాలన ప్రజలమీద రుద్దుతున్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఒక ఇల్లు కట్టడానికి ఢిల్లీలో ఇందిరా అవాస్‌యోజన, పట్టణాలలో వాల్మీకి, అంబేద్కర్ అవాస్‌యోజన (వాంబే) పథకాలు,



ఒక రోడ్డు వెయ్యడానికి ప్రధాన మంత్రి సడక్ యోజన, మంచి నీళ్ల ఇవ్వడానికి ఒక సుజలపథకం, మరుగుదొడ్ల నిర్మాణానికి మరో పథకం, ఒక బల్బు ఇవ్వడానికి వెలుగు పథకం.... ఇలా గ్రామంలో జరగాల్సిన ప్రతి పనికీ ఒక పథకం, దానికోసం అర్జీలు, పిటీషన్లు, ఆందోళనలు, ఎదురుచూపులు తప్పడం లేదు.

ఏడాదికో బాట పేరుతో ప్రజల వద్దకు పాలన అనడం కంటే దగా మరొకటి వుండదు. ప్రజాస్వామ్యంలో పౌరులు కేంద్రంగా పాలన సాగాలి. ఇప్పుడు ఢిల్లీ కేంద్రంగా, హైదారాబాద్ కేంద్రంగా పాలన సాగుతున్నది. పాలన ప్రజల మధ్యన వుండాలి. అది జరగాలంటే పంచాయితీలను, మున్సిపాలిటీలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలి.

73,74 రాజ్యాంగ సవరణలతో పంచాయితీలు, మున్సిపాలిటీలు స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాలుగా ప్రకటించబడ్డాయి. కాని రాష్ట్రాలు వాటికి అధికారాలు, నిధులు, సిబ్బందిని బదలాయించడం లేదు. ఒకనాడు గాంధీజీ గ్రామ స్వరాజ్యం లేకుండా పూర్ణ స్వరాజ్యం లేదన్నారు. ఇప్పుడు గ్రామస్వరాజ్యాలు, పట్టణ స్వరాజ్యాలు లేవు. అంటే పూర్ణ స్వరాజ్యం లేదు. దానిని సాధించుకోవాలి. అదే సురాజ్య ఉద్యమం.


పట్టణాలలో గ్రామాలలో ప్రజలందరికీ గృహవసతి వుండాలి. శుద్ధిచేసిన మంచినీరు అందాలి. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి. మురుగునీరు పోయే ఏర్పాటు, చెత్తాచెదారం తొలగింపుతో మెరుగైన పారిశుధ్యం వుండాలి. రోడ్లు, లైట్లు, రవాణా సౌకర్యాలు 24 గంటల గృహవిద్యుత్ పొందాలి.

పిల్లలకు ఉచితంగా మంచి ప్రమాణాల చదువు ఇచ్చే పాఠశాలలు, వైద్యసేవలు అందించే ఆరోగ్య కేంద్రాలు ఉపాధి నైపుణ్యాలకు శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు, ఎక్కడికక్కడే లబ్ధిదారుల ఎంపిక, సర్టిఫికేట్లు పొందే ఏర్పాట్లు, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లు జరగాలి.

ఇవన్నీ స్థానిక ప్రభుత్వాలతో సాధ్యం. ప్రజలకు స్వతంత్ర జీవనం, మెరుగైన వసతులు సాధ్యం. అందుకోసం తగిన విధులు, నిధులు, సిబ్బందిని బదలాయించాలి. తలసరిగ్రాంటుగా 1000 రూపాయలు ఈ ప్రభుత్వాలకు అందించాలి. అవినీతి జరిగితే చర్యలు తీసుకునే ఆంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలి. ప్రజలకు ఇంటిముందు ప్రభుత్వం – కంటిముందు పాలన అందించాలి. ప్రజల మౌలిక అవసరాలు తీర్చాలి – మంచి వసతులు కల్పించాలి. దీనిని సాధించడం కోసమే సురాజ్యఉద్యమం. ◆


# హక్కుగా ప్రభుత్వ సేవల చట్టం కావాలి

హక్కుగా పౌరసేవలు అందించే చట్టం ప్రస్తుతం పార్లమెంటు సెలక్ట్ కమిటీ ముందున్నది. ఒకవేళ పార్లమెంటులో ఈ చట్టం ఆమోదం పొందినా అన్ని రాష్ట్రాలకు అది వర్తించేలా వస్తుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే లోక్‌పాల్ బిల్లులో రాష్ట్రాలకు కూడా వర్తించే లోకాయుక్తల ఏర్పాటును ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకించాయి. రాష్ట్రాల హక్కులను హరించడంగా గగ్గోలు చేశాయి. దానికి బి.జె.పి కూడా రాజకీయాల లబ్ధికోసం వంతపలకడంతో అది బుట్టదాఖలు అయింది. అందుచేత కేంద్రంప్రభుత్వ సేవలకే ఈ హక్కుచట్టం పరిమితం అయ్యే అవకాశాలే వున్నాయి. రాష్ట్రప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీదే స్థానిక పౌరసేవల హక్కు చట్టాల భవిష్యత్తు ఆధారపడివుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. తమ ఓటు ద్వారా ప్రజాప్రతినిధులకు అధికారాలనిస్తున్నారు. పన్నుల సొమ్ము ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు సమకూరుస్తున్నారు. అందుకే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా వుండాలి. పాలన ప్రజలకు తెలిసేలా పారదర్శకంగా జరగాలి. ప్రజలు హక్కుగా ప్రభుత్వసేవలను పొందాలి అన్నది ఈ హక్కు వెనక ఉన్న సూత్రం.



## రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సిటిజన్స్ ఛార్టర్లు ఉన్నాయి. మున్సిపాలిటీలలో ఒక జి.వో ద్వారా సకాలంలో సేవలు అందించకపోతే పరిహారం చెల్లించే పద్ధతి ఉంది. అయితే మన రాష్ట్రంలో వీటికి చట్టబద్ధత లేదు. సేవలు అందించకపోతే హక్కుగా పొందే ప్రత్యేక ఏర్పాటు లేదు. రాష్ట్రంలో సిటిజన్స్ ఛార్టర్లు కేవలం కాగితాల మీద, ఆఫీసుల దగ్గర బోర్డుల ప్రదర్శనతో సరిపెట్టుకున్నాయి. ప్రజలకు నిత్యజీవితంలో పొందాల్సిన రోజువారీ సేవలు అందించడంలో జవాబుదారీతనం పూర్తిగా లోపించింది. పోలీసు స్టేషన్లలో కేసుల నమోదు, ఎఫ్.ఐ.ఆర్ కాపీలు పోస్టుమార్టం రిపోర్టులు వగైరాలు లంచం లేకుండా ఎవరికీ దక్కడం లేదు. తహశీల్ ఆఫీసులలో, జనన మరణ సర్టిఫికేట్లు, కులధృవీకరణ, ఆదాయం, నివాస వగైరాల సర్టిఫికేట్లు, పాస్ పుస్తకాలు, ఆడంగల్‌కాపీలు వగైరాలన్నింటిలో అవినీతి తప్పడం లేదు. ఇలా రిజిస్ట్రేషన్ ఆఫీసు, విద్యుత్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, పంచాయితీలు, మున్సిపాలిటీలు వగైరా శాఖలలో **సేవకు తగ్గ లంచం** చెల్లించకుండా పనులు జరగడం లేదు. కళాశాలలో, పాఠశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్పులు, హాస్టల్ పిల్లలకొచ్చే నిధులు, పరీక్షపత్రాల నకలు



కాపీలు వగైరాలన్నింటా అవినీతి రాజ్యం చేస్తున్నది. ప్రజలు నిత్యం ఈ చిల్లర అవినీతితో సతమతమౌతున్నారు. నిత్యజీవితంలో ప్రతి చిన్న సేవకీ ఆఫీసుల చుట్టూ రోజుల తరబడి తిరిగే పరిస్థితిని, చేయి తడిపితే గాని పని జరగని స్థితిని, పౌరసేవల హక్కు చట్టం తొలగిస్తుంది. ప్రజలకు సకాలంలో ప్రభుత్వసేవలు అందుతాయి. ప్రభుత్వ సేవలలో అవినీతిని అంతం చేస్తుంది. పాలనలో జవాబుదారీతనాన్ని తెస్తుంది. అందుకే ఇలాంటి చట్టం సామాన్యులకి, పేదలకి, విద్యార్ధులకీ ప్రయోజనాన్ని సమకూరుస్తుంది.

## వివిధ రాష్ట్రాలలో హక్కు చట్టాలు

అంతర్జాతీయంగా, దేశీయంగా నానాటికీ ప్రజల హక్కులు విస్తరిస్తున్నాయి. ప్రజలు తమ హక్కుల కోసం డిమాండ్ చెయ్యడం, మరొక పక్క ప్రభుత్వాలు రాజకీయంగా ప్రయోజనం పొందాలన్న దృష్టి పెరగడంలో ఈ హక్కుల విస్తరణ వేగవంతం అయింది. దేశంలో సమాచార హక్కు చట్టం (2005) ఉపాధి హామీ చట్టం (2009) విద్యాహక్కు చట్టం (2009) వగైరాలన్నీ ఇలా వచ్చిన చట్టాలే. అలాగే చాలా రాష్ట్రాలలో 2010 తర్వాత పౌరసేవల హక్కు చట్టాలను తెచ్చాయి.

| రాష్ట్రం పేరు | హక్కుగా ఇచ్చే సేవల సంఖ్య | శాఖల సంఖ్య | గడువులోగా అందించకపోతే జరిమానాలు | నిర్వహించే నోడల్ శాఖ |
|---|---|---|---|---|
| మధ్యప్రదేశ్ | 52 | 16 | రోజుకి 250 రూ, గరిష్టం 5000 రూ. | పౌర సంబంధాల శాఖ |
| ఉత్తరప్రదేశ్ | 17 | 5 | రోజుకి 250 రూ. గరిష్టం 5000 రూ. | రెవిన్యూశాఖ |
| బీహార్ | 50 | 10 | రోజుకి 250 రూ. గరిష్టం 5000 రూ. | జనరల్ అడ్మినిస్ట్రేషన్ |
| రాజస్థాన్ | 108 | 15 | రోజుకి 250 రూ. గరిష్టం 5000 రూ. | పాలనా సంస్కరణల శాఖ |
| ఢిల్లీ | 70 | 22 | రోజుకి 10 రూ. గరిష్టం 200 రూ. | ఐ.టి. శాఖ |

సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డావలప్‌మెంటు సంస్థ తరఫున తినిమాధుర్ తన పరిశోధనా పత్రంలో వివిధ రాష్ట్రాలలో వచ్చిన చట్టాలను, వాటి పనితీరును పరిశీలించి 2012 ఫిబ్రవరిలో ప్రకటించారు. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో 14 రాష్ట్రాలలో వివిధ పేర్లతో 2010–11 సంవత్సరాల మధ్యకాలంలో పౌరసేవల హక్కు చట్టాలు వచ్చాయి.

### పౌరసేవల హక్కు చట్టాలున్న రాష్ట్రాలు

మధ్యప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొట్టమొదటగా పౌరసేవల హక్కు చట్టాన్ని 2010లోనే తీసుకువచ్చింది. ఇక 2011లో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, జమ్ము-కాశ్మీర్, బీహారు, రాజస్థాన్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబు, జార్ఖండ్, ఛత్తీస్‌ఘర్, కేరళ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలు పౌరసేవల హక్కు చట్టాలను తెచ్చాయి.

ఇందులో 5 రాష్ట్రాలలో ప్రత్యేక అధ్యయనం చేసిన తినామాధుర్ ఆ చట్టాలలోని అంశాలను ఇలా క్రోడీకరించారు.

ఉన్నంతలో రాజస్థాన్ చట్టం 15 శాఖలకే పరిమితమైనా 108 సేవలకు విస్తరించింది. ఇతర రాష్ట్రాలలో ఈ శాఖలకు సంబంధించి వున్న సేవలకంటే అదనపు సేవల్ని అందులో చేర్చింది. మధ్యప్రదేశ్ చట్టం సర్టిఫికేట్లు, భూమి రికార్డులతో పాటు పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను చేర్చారు. బీహారు చట్టంలో మానవవనరుల అభివృద్ధి శాఖను చేర్చి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మార్కుల జాబితా, యూనివర్శిటీ ధృవీకరణపత్రాలను చేర్చారు. ఢిల్లీలో అత్యధికశాఖల్ని ఈ చట్టం పరిధిలోకి తెచ్చారు.

మొత్తంమీద ఈ చట్టాలన్నీ ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లుగానే వున్నాయి. కొన్ని శాఖలకు, కొన్ని సేవలకు మాత్రమే పరిమితం అయ్యాయి.

ఈ రాష్ట్రాలలో స్థూలంగా ప్రభుత్వశాఖలలో సేవలు అందించడానికి నిర్దిష్టంగా ఏర్పాటు చేశారు. గడువును నిర్ణయించారు. గడువు మీరితే జరిమానాలను ప్రవేశపెట్టారు. ఈ మేరకు చట్టాలలో ఒక ఏకీభావం వుంది.

అలాగే ఈ చట్టాల అమలు బాధ్యత ఆయా శాఖల పరిధిలోనే వున్నాయి. అప్పిలెట్ అథారిటీలు, ఆయా శాఖల ఉన్నతోద్యోగులకే అప్పగించారు. నోడల్ ఏజన్సీలు వున్నా వివిధ శాఖలలో సేవలు అందిస్తున్న తీరును సమీక్షించేవిగానే కనిపిస్తున్నాయి. కొన్ని చట్టాలలో ఆలస్యానికి పరిహారంగా కొంత మొత్తాన్ని

దరఖాస్తుదారునికి ఇచ్చే ఏర్పాటు వుంది – చాలా వాటిలో ఇది లేదు. మొత్తంమీద 14 రాష్ట్రాలలో పౌరసేవల చట్టాలు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. వీటి అనుభవం కొత్తగా చట్టాలు తెచ్చే రాష్ట్రాలకు ఎంతగానో ఉపకరిస్తుంది.

## పౌరసేవల హక్కు చట్టం కోసం రాష్ట్రంలో ఉద్యమం

పౌరసేవల హక్కు చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెనకబడి వుంది. పౌరసేవలు అందించడంలో ఉదాశీనంగా వుంది. ప్రతి చిన్న పనికి లంచం; మామూళ్లు తప్పనిసరి అయింది. చట్టబద్ధంగా సేవలు పొందే హక్కు లేకుండా ఎన్ని 'ఈ' సేవలు, "మీ" సేవలు పెట్టినా ఫలితం వుండదు. ప్రజలు విసుగుచెందినప్పుడల్లా ప్రభుత్వాలను మారుస్తున్నారు. పార్టీలు మారుతున్నాయి. ముఖ్యమంత్రులు మారుతున్నారు. కాని ప్రభుత్వ కార్యాలయాల పనితీరు మారడం లేదు. మార్చాలన్న చిత్తశుద్ధి పాలకులకు కలగడం లేదు.

ప్రజలు హక్కుగా పౌరసేవలు పొందడానికి ఈ క్రింది అంశాల ప్రాతిపదికన చట్టం రావలసి ఉంది.

- రాష్ట్రంలో అన్ని ప్రభుత్వకార్యాలయాలకు సిటిజన్స్ ఛార్టర్లు ప్రకటించాలి.
- ప్రతిసేవకు నిర్దిష్టంగా గడువు, గడువుమీరితే జరిమానా, దరఖాస్తుదారులకు పరిహారం చెల్లించే పద్ధతి ఉండాలి.
- ప్రతి ఆఫీసులో ఒకేచోట సేవలు అందించే ఏర్పాటు వుండాలి. అందుకు బాధ్యుల్ని నియమించాలి.
- ఒక అప్పీలు మాత్రం అదే ఆఫీసులో చేసుకునే ఏర్పాటు వుండాలి.
- దానిపైన స్వతంత్ర ప్రతిపత్తి గల విచారణ వ్యవస్థ ఆంబుడ్స్‌మన్ వుండాలి. ప్రతి జిల్లాలో లేదా రెవెన్యూ డివిజన్ స్థాయిలో దానిని ఏర్పాటు చెయ్యాలి.
- సేవను బట్టి అప్పీళ్ళ సమయాన్ని నిర్ణయించాలి. సర్టిఫికేట్లను నెలల తరబడి వాయిదాలకు వీలు లేకుండా చూడాలి.
- తక్షణ సేవలకు ప్రత్యేక తత్కాల్ పద్ధతిని ప్రభుత్వశాఖలు పాటించాలి.

దేశంలో 14 రాష్ట్రాలలో పౌర సేవలను హక్కుగా చేస్తూ చట్టాలు తెచ్చినా మన రాష్ట్రప్రభుత్వం తీరు చూస్తే అలాంటి చట్టం తెస్తారని ఆశ ఎండమావిగానే ఉంది. ◆

# అవినీతి భరతం పట్టే కొత్త లోకాయుక్త

లోక్‌పాల్ చట్టం ప్రస్తుతం లోక్‌సభ ఆమోదం పొంది రాజ్యసభ ఆమోదానికి ఎదురు చూస్తున్నది. అక్కడా ఆమోదం పొందినా అది కేంద్రం పరిధిలోని ప్రజాప్రతినిధులకు, అధికార బృందానికి మాత్రమే వర్తించేదిగా వుంటుంది. రాష్ట్రంలో అవినీతిపరుల ఆట కట్టించడానికి తగిన లోకాయుక్తలను ఎక్కడికక్కడే సాధించుకోవలసి వుంటుంది.

అన్నాహజారే బృందం ప్రకటించిన జనలోక్‌పాల్ బిల్లులో మొదట ఈ లోకాయుక్తల ప్రస్తావన లేదు.

లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఢిల్లీలో (2011 మే 24) జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో దేశానికంతటికీ వర్తించే ఏకీకృతం చట్టం కావాలని ప్రతిపాదించింది. దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకు లోకాయుక్త, జిల్లాలకు అంబుడ్స్‌మన్ వ్యవస్థలు వుండాలని డిమాండ్ చేసింది. ఆ తర్వాతనే అన్నా బృందం తమ జనలోక్‌పాల్‌లో దీనిని కూడా జతపర్చారు.

పార్లమెంటులో అన్ని రాజకీయ పార్టీలు దీనిని స్థూలంగా అంగీకరించాయి. కాని బిల్లు చర్చకు వచ్చేనాటికి ఇది రాష్ట్రాల హక్కుల్ని హరిస్తుందని ప్రధానంగా ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకించడంతో లోక్‌సభలో ఆమోదం కోసం దీనిని బిల్లు నుండి తొలగించారు.

ఈ నేపథ్యంలో దేశానికంతటికీ వర్తించే లోక్‌పాల్ చట్టం వచ్చే అవకాశాలు లేకుండా పోయాయి. రాష్ట్రాలలో బలమైన లోకాయుక్తల ఏర్పాటు కోసం ఎక్కడికక్కడ ప్రజల్ని సమీకరించి సాధించుకోవాల్సి వుంది. అందువల్లనే లోక్‌సత్తా సురాజ్య ఉద్యమంలో బలమైన లోకాయుక్త ఏర్పాటును ఒక ప్రధాన డిమాండ్‌ను చేసింది.

రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో అవినీతిని, అధికార దుర్వినియోగాన్ని నివారించడానికి ప్రజాప్రతినిధులలో, అధికారులలో జవాబుదారీతనాన్ని పెంచడానికి లోకాయుక్తలు ఉద్దేశించబడ్డాయి. భారతదేశంలో 1966లో మొదటి పాలనా సంస్కరణల సంఘం ఇలాంటి వ్యవస్థ అవసరాన్ని నొక్కి చెప్పింది. ప్రజల

ఫిర్యాదులను పరిష్కరించడానికి, ప్రజాప్రతినిధులలో, పౌరసేవలలో అవినీతిని నిరోధించడానికి ఇలాంటి ప్రత్యేక వ్యవస్థలు అవసరమని భావించింది. జాతీయస్థాయిలో లోక్‌పాల్, రాష్ట్రాల స్థాయిలో లోకాయుక్త వ్యవస్థలను సిఫారసు చేసింది. ఈ సిఫారసుల ఆధారంగా దేశంలో ఈ వ్యవస్థల రూపకల్పనకు ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి.

## కేంద్రంలో లోక్‌పాల్

1968, 1971, 1977, 1985, 1989, 1996, 1998, 2001 కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటుకు పార్లమెంటు ముందుకు బిల్లులు వచ్చాయి. కాని ఏదో ఒక కారణంతో అది మురుగిపోతూ వచ్చాయి. 2011లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన లోక్‌పాల్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొంది, రాజ్యసభలో చతికిలబడి అలాగే వుండిపోయింది.

## రాష్ట్రాలలో లోకాయుక్తలు

ప్రస్తుతం దేశంలో 19 రాష్ట్రాలలో లోకాయుక్త – ఉపలోకాయుక్త చట్టాలు, వ్యవస్థలు వున్నాయి. మహారాష్ట్ర (1971) బీహారు (1973) రాజస్థాన్ (1973) ఉత్తరప్రదేశ్ (1975) మధ్యప్రదేశ్ (1981) ఆంధ్రప్రదేశ్ (1983) హిమాచల్‌ప్రదేశ్




(1983) కర్నాటక (1985) అస్సాం (1986) గుజరాత్ (1986) కేరళ (1988) పంజాబ్ (1995) ఢిల్లీ (1996) హర్యానా (1996) లలో ఇలాంటి చట్టాలు, వ్యవస్థలు వచ్చాయి. దేశంలో మొట్టమొదటిగా ఒరిస్సాలో 1970లోనే ఈ వ్యవస్థ ఏర్పడినా 1993లో దానిని రద్దు చేశారు.

2011లో ఉత్తరాఖండ్‌లో దీనికి ఒక చట్టం చేసినా అది ఇంకా రాష్ట్రపతి ఆమోదం పొందనందున అమలులోకి రాలేదు.

## లోకాయుక్తల పనితీరు

దేశంలో మొత్తంమీద లోకాయుక్తల పనితీరు పూర్తిగా నిరాశాజనకంగా వుంది. రాష్ట్రాలలోని పాలకవర్గాలు ఈ వ్యవస్థలను బలోపేతం చెయ్యడానికి బదులు నీరుగారుస్తూ వచ్చాయి. తమ అవినీతిని, పాలనలో అవినీతిని మరుగునపర్చడమే లక్ష్యంగా వీటికి అధికారాలు, నిధులు, సిబ్బంది లేకుండా చేశాయి. పశ్చిమబెంగాల్‌లో లోకాయుక్త ఆఫీసులో ఇద్దరే ఇద్దరు సిబ్బంది అదీ గ్రూపు డి స్థాయి ఉద్యోగులు మాత్రమే వున్నారు. గుజరాత్‌లో 2003 నుండి 2011 వరకు లోకాయుక్త లేకుండానే సాగిపోయింది. 2011లో గవర్నరు ఈ పదవిని నామినేషన్ ద్వారా భర్తీ చెయ్యడంతో



ఆయనపై గుజరాత్ ప్రభుత్వం విరుచుకుపడింది. కోర్టు తీర్పు ఈ నియామకాన్ని సమర్థించింది.

దేశంలోనే కర్నాటకలో వున్న లోకాయుక్త చట్టం బలమైంది. దానికి అధికారాలు, సిబ్బందికి తగిన ఏర్పాట్లు వున్నాయి. ఈ చట్టం పరిధిలో ముఖ్యమంత్రి కూడా వున్నారు. ఈ లోకాయుక్త ముందు నలుగురు మాజీ ముఖ్యమంత్రుల కేసులు విచారణలో వున్నాయి. ఇక్కడ లోకయుక్తగా వున్న సంతోష్ హెగ్డే ఆ రాష్ట్రంలో జరిగిన గనుల కుంభకోణాన్ని వెలికితీశారు. 12 వేల కోట్ల విలువైన అక్రమ గనుల తవ్వకంలో సాక్ష్యాధారాలను ప్రకటించారు. అప్పటి ముఖ్యమంత్రి యడ్యూరప్ప ముఖ్యమంత్రి పదవిని కోల్పోయి 21 రోజులపాటు జైలులో వుండాల్సి వచ్చింది. సంతోష్ హెగ్డే పదవీవిరమణ తర్వాత 6,7 నెలలు గడిచినా అక్కడ ప్రస్తుతం లోకాయుక్త లేదు. ఒక లోకాయుక్తను నియమిస్తే ఆయనపై ఆరోపణలు రావడంతో వైదొలగారు. తగిన లోకాయుక్త కోసం వెదుకులాడే నెపంతో కాలయాపన సాగిపోతున్నది.

కేరళలో లోకాయుక్త పరిధిలో ముఖ్యమంత్రితో సహా అన్ని స్థాయిల రాజకీయ ప్రజా ప్రతినిధుల మీద, పాలనా వ్యవస్థలోని ఉద్యోగుల మీద అధికారాన్ని కలిగి వుంది. కాని దానికి తనంతట తాను చొరవ తీసుకుని విచారణ జరిపే అధికారం లేదు. దానికి స్వంత సిబ్బంది లేదు. రాష్ట్ర సచివాలయంలో భాగంగానే పనిచేస్తున్నది. అయినప్పటికీ అది యు.డి.ఎఫ్ మంత్రి కె.కె.రామచంద్రన్ మీద ఉచ్చు బిగించింది. ఆయన రాజీనామా చేయకతప్పలేదు.

2011లో ఉత్తరప్రదేశ్‌లో లోకాయుక్త కొంత చొరవను ప్రదర్శించింది. మాయావతి మంత్రివర్గంలో 9 మందికి ఉద్వాసన చెప్పాల్సివచ్చింది. మరో 19 మంది మంత్రుల మీద నేరపరిశోధన సాగిస్తున్నది. అయితే అక్కడ లోకాయుక్తకి ప్రాసిక్యూషన్ నిర్వహించే అధికారం లేదు. నేర పరిశోధన విభాగంలో తగినంత మంది సిబ్బంది లేదు. అంతకు మించి లోకాయుక్త సిఫారసులు ప్రభుత్వం తప్పనిసరిగా అమలుచేసి తీరాలన్న నిబంధన లేదు.

ఇక మిగిలిన రాష్ట్రాలలో ఇలాంటి పరిస్థితి కూడా లేదు. లోకాయుక్తలను ఏర్పాటు చేసి ఊరుకున్నారే తప్ప అవి పని చెయ్యడానికి తగిన ఏర్పాట్లు ఏ మాత్రం

చెయ్యడం లేదు. 1972 నుండీ మహారాష్ట్రకు లోకాయుక్త ఉన్నప్పటికీ, దానికి నేరపరిశోధన అధికారాలున్నప్పటికీ విచారణ చేసే అధికారం లేదు. స్వంత నేరపరిశోధనకు ఏర్పాటు లేదు. ఆ రాష్ట్రంలో విజిలెన్స్ కమిషన్‌ను కూడా ఏర్పాటు చెయ్యలేదు. 1973 నుండి రాజస్థాన్‌లో లోకాయుక్త వ్యవస్థ ఉన్నప్పటికీ దాని పరిధిలో కేవలం ఉద్యోగులు తప్ప ప్రజా ప్రతినిధులు లేరు. దానికి నేర పరిశోధనా విభాగం లేదు. శిక్షించే అధికారమూ లేదు. అస్సాంలో ఉపలోకాయుక్తే లోకాయుక్తగా వ్యవహరిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రిపై వచ్చిన "డంపర్‌స్కామ్" విషయంలో లోకాయుక్త ఆయనను నిర్దోషిగా చూపెట్టడం అందరి విమర్శలకూ గురైంది.

తమిళనాడులో లోకాయుక్త ఏర్పాటు గురించి ఎవరూ ఆలోచించిన పాపాన పోలేదు. పైగా కేంద్రంలో ఇటీవల లోక్‌పాల్ బిల్లులో భాగంగా రాష్ట్రాలకు లోకాయుక్తలను ఏర్పాటు చెయ్యాలన్న ప్రతిపాదనలను డి.యం.కె. అన్నా డి.యం.కె పార్టీలు రెండూ వ్యతిరేకించాయి. ఇక్కడ విజిలెన్స్ డైరెక్టర్ అవినీతి నిరోధక సంస్థ దాదాపు అన్ని అవినీతి కేసుల్ని రిజిష్టర్ చేస్తున్నాయి. అవినీతి నిరోధక సంస్థ ప్రభుత్వం అధీనంలో వుంది. పైగా దానికి ప్రభుత్వ అనుమతి లేకుండా విచారణ చేసే అధికారం కూడా లేదు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో లోకాయుక్త – ఉప లోకాయుక్తలు వున్నారు. 133 మంది సిబ్బంది ఉండాల్సిన చోట 22 మాత్రమే ఉన్నారు. వీరు చెయ్యగలిగింది నామమాత్రంగానే వుంది. ఎక్కడైనా ప్రభుత్వ యంత్రాంగం విధి విధానాలు అమలులో నిర్దిష్టమైన పొరబాట్లు జరిగితే వాటిని చక్కదిద్దడం. జాప్యం జరిగితే దానిని సరిదిద్దడం వంటి చర్యలు తప్ప తీవ్రమైన నేరాలు చేసిన వారిని బోనులో నిలబెట్టే స్థితి లేదు.

ఇటీవల బీహారులో పాత చట్టాన్ని సవరించారు. ముఖ్యమంత్రిని, మాజీ ముఖ్యమంత్రుల్ని దాని పరిధిలోకి తెచ్చారు. అయితే దాని అమలుతీరు ఎలా వుంటుందో వేచి చూడాల్సిందే. ఇకపోతే ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఎన్నికల ముందు 2011లో అన్ని హంగులు గల బలమైన లోకాయుక్త చట్టాన్ని ఆమోదించింది. అయితే అది అతి తెలివిని ప్రదర్శించింది. గొప్ప చట్టాన్ని తెచ్చామన్న ప్రచారం రావాలి. కాని అది అమలు కాకుండా వుండేలా చూడాలి అన్న సూత్రాన్ని పాటించారు.

రాష్ట్రాల అధికారాల పరిధికి మించిన అంశాలను జోడించి ఈ బిల్లును రూపొందించారు గవర్నరు ఆమోదంతో సరిపోయే దాన్ని రాష్ట్రపతి ఆమోదానికి పంపాల్సి వచ్చింది. అందువల్ల దీని ఆమోదం ప్రశ్నార్థకంగానే మిగిలింది.

మొత్తంమీద రాష్ట్రాలలో పెచ్చరిల్లుతున్న అవినీతిని అరికట్టే విధంగా ఈ లోకాయుక్తలు లేవు. వీటికి తమంతట తాము కేసు నమోదు చేసే అధికారం వుండాలి. అనుమతుల అడ్డంకులన్నిటినీ తొలగించాలి. లోకాయుక్తలకు స్వతంత్రమైన నేరపరిశోధనా విభాగం, స్వతంత్రమైన ప్రాసిక్యూషన్ వ్యవస్థ వుండాలి. సత్వర విచారణలకు ప్రత్యేక కోర్టులు, అక్రమ ఆస్తుల స్వాధీనానికి అధికారాలు వుండాలి. లోకాయుక్తల నియామకం పారదర్శకంగా ప్రభుత్వం ప్రతిపక్ష నేత, ప్రాతినిధ్యం వహించే కమిటీ ఏకాభిప్రాయంతో సాగే పద్ధతి వుండాలి. సమర్థులనీ, నిజాయితీపరుల్ని ఎంపిక చెయ్యడం మీద శ్రద్ధ చూపాలి అలాంటి కోరలు గల లోకాయుక్తలు మాత్రమే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తాయి. ప్రజా చైతన్యంతోనే ఇలాంటి వ్యవస్థలు సాధ్యం అవుతాయి. ◆





Satish Sringeri

### డబ్బుసంచుల చుట్టూ తిరిగే వ్యవస్థ కన్నా

# దామాషా పద్ధతి ఎన్నికలే మిన్న

బలమైన లోక్‌పాల్ కోసం దేశంలో సాగిన చర్చ ఇప్పుడు ఎన్నికల సంస్కరణల మీద చర్చలు దారితీయడం ఒక మంచి పరిణామం. అవినీతికి వ్యతిరేకంగా దేశంలో దశాబ్దాల తరబడి ఉద్యమాలు సాగుతున్నాయి. ఈ ఉద్యమాలు నిర్వహిస్తున్న వివిధ స్రవంతులు ప్రజాచైతన్యాన్ని పెంచుతూవచ్చాయి. ఇటీవల ఈ అవినీతి వ్యతిరేక ఉద్యమం ఒక కొత్త దశకు చేరింది. అవినీతికి అడ్డుకట్ట వేసే బలమైన లోక్‌పాల్ చుట్టూ ఈ ప్రజాభిప్రాయం సమీకృతం అయింది. అన్నాహజరే దీక్ష దీని వ్యక్తీకరణ సాధన అయింది. ఇప్పుడు బలమైన లోక్‌పాల్ చట్టం సాధించడానికి మార్గం సుగమం అయింది.

దేశంలో అవినీతి నిరోధానికి బలమైన చట్టం అవసరం. కాని అదొక్కటే సరిపోదు. కేవలం చట్టాలు మాత్రమే వ్యవస్థని పూర్తిగా చక్కదిద్దలేవు. దొంగల్ని శిక్షించడానికి



చట్టాలు అవసరం. అయితే దొంగల్ని సృష్టిస్తున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థల్ని సంస్కరించకపోతే దొంగలు పుట్టుకొస్తూనే వుంటారు. దొరికినవాళ్లే దొంగలుగా శిక్షార్హులవుతారు. అవినీతి కూడా ఇలాంటిదే.

మన ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థ అవినీతి మీద మనుగడ సాగిస్తున్నది. దానిని పెంచి పోషిస్తున్నది. మన రాజకీయం ఇంతగా కుళ్లిపోవడానికి, ఇంతగా డబ్బు చుట్టూ తిరగడానికి, ఇంతగా అవినీతిమయం కావడానికి ఈ ఎన్నికల వ్యవస్థే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. మన రాజకీయ సంస్థలు ఈ ఎన్నికల వ్యవస్థని సంస్కరించకపోగా దానిలో భాగస్వామిగా మారాయి. ఎన్నికల్లో గెలుపుకోసం కోట్లు ఖర్చుపెట్టడం అధికారంలోకి రాగానే కోట్లు దండుకునేందుకు ద్వారాలు తెరవడం అలవాటు చేసుకున్నాయి. ఈ ఎన్నికల వ్యవస్థ వికృతరూపాన్ని దీన్ని అనుసరిస్తున్న పార్టీల విశృంఖల అవినీతిని ఇప్పుడు మనం స్పష్టంగా చూస్తున్నాం. అందుచేత అవినీతి మీద జరిపే పోరాటాన్ని మరో దశకు తీసుకువెళ్లాలి. రాజకీయ అవినీతికి జన్మస్థానంగా వున్న ఎన్నికల వ్యవస్థని మార్చడానికి, అవినీతిమయమైన రాజకీయ వ్యవస్థల ప్రక్షాళనకీ ఉద్యమాన్ని నడిపించాలి.

ప్రపంచంలో ప్రధానంగా రెండు తరహాల ఎన్నికల వ్యవస్థలు వున్నాయి. ఒకటి ఫస్ట్ పాస్ ది పోస్టు (FPTP) పద్ధతి. ఇక్కడ నియోజకవర్గం ప్రాతిపదికగా వుంటుంది. గెలుపు ఓటములు నియోజకవర్గంలోనే తేలిపోతాయి. పోటీ చేసే అభ్యర్థులలో ఎవరికి ఒక ఓటు ఆధిక్యత వస్తే వారు గెల్చినట్లు మిగిలిన వారు ఓడినట్లు. ఓడిన వారికి వచ్చిన ఓట్లు అక్కడే మురిగిపోతాయి. మనదేశంలో అటు పార్లమెంటుకీ ఇటు అసెంబ్లీకి మనం అనుసరిస్తున్న ఎన్నికల పద్ధతి ఇదే. ఈ పద్ధతిలో నియోజకవర్గంలో గెలుపు ముఖ్యం గనుక కేంద్రీకరణ అంతా నియోజకవర్గం మీద, అభ్యర్థుల మీద ఆధారపడి వుంటుంది. గెలుపును అందించే ఆ ఒక్క ఓటు పొందడం కోసం ధనబలం, కండబలం, కులబలం వగైరాలన్నింటినీ కేంద్రీకరించడం జరుగుతుంది. అందువల్లనే ఎన్నికల్లో కోట్లు గుమ్మరించడం తప్పనిసరి అయింది.

ఇక రెండవది దామాషా పద్ధతి ఎన్నిక. ఇందులో స్థూలంగా రెండు రకాలున్నాయి. చిన్న దేశాలు, తక్కువ జనాభా వున్న దేశాలలో పార్టీజాబితా పద్ధతి వుంది. ఈ పద్ధతిలో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను ముందుగా ప్రకటించి, ఎన్నికల

కమిషన్‌కు అందజేస్తాయి. ఎన్నికల్లో పార్టీలకే ప్రజలు ఓట్లు వేస్తారు. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే ఆ దామాషాలో ఆ పార్టీకి సీట్లు వస్తాయి. పార్టీ ప్రకటించిన జాబితా వరుసక్రమంలో అభ్యర్ధులు చట్టసభ సభ్యులవుతారు. ఈ పద్ధతిలో నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వుండదు.

ఇక రెండవ పద్ధతిని మిశ్రమ సభ్యత్వ దామాషా పద్ధతిగా పిలుస్తారు. ఇందులో మొత్తం చట్టసభ సభ్యుల సంఖ్యలో సగం స్థానాలు నియోజకవర్గాల నుండి గెలిచే వారికి, సగం స్థానాలు పార్టీజాబితా అభ్యర్ధులకీ కేటాయిస్తారు. ఓటర్లకు రెండు ఓట్లు వుంటాయి. ఒకటి నియోజకవర్గంలో అభ్యరికి, ఒకటి పార్టీకి ఓటు చేసుకునే వీలుంటుంది. మొత్తంమీద చట్టసభలో ఒక పార్టీకి ఎన్ని ఓట్లు వస్తే ఆ శాతం దామాషాలో మాత్రమే సీట్లు వస్తాయి. అంటే నియోజకవర్గాలలో ఆ పార్టీ అభ్యర్ధులు గెలిచినా, ఓడినా మొత్తం మీద ఆ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం ఆధారంగానే సీట్లు దక్కుతాయి.

మనం అనుసరిస్తున్న ఒక ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ ధనరాజకీయానికి తద్వారా అవినీతికీ ద్వారాలు తెరవడమే కాకుండా ప్రజాస్వామ్య మౌలిక లక్ష్యాలకు హాని చేస్తుంది. ఈ మౌలిక లక్ష్యాల ఆధారంగా ఈ రెండు ఎన్నికల పద్ధతుల్ని ఇప్పుడు పరిశీలించుకుందాం....

## ప్రతి ఓటుకీ చట్టసభలో ప్రాతినిధ్యం....

మొదటిది: ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో పౌరులు వేసే ప్రతి ఓటుకీ చట్టసభలో ప్రాతినిధ్యం లభించాలి. అప్పుడే ఆ చట్టసభ ఓటర్ల అభిమతాన్ని ప్రతిబింబిస్తుంది. ఎన్నికల వ్యవస్థ దీనికి దోహదం చేసేదిగా వుండాలి. హరించేది కాకూడదు. ప్రస్తుతం ఒక్క ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ దీనిని ఎలా హరిస్తున్నదీ గత అసెంబ్లీ ఎన్నికలనే ఉదాహరణగా తీసుకుందాం.

2009 ఎన్నికలలో రాష్ట్రంలో 5,78,92,259 మంది ఓటర్లకు గాను 4,20,58,446 మంది ఓటు వేశారు. అంటే రాష్ట్ర శాసన సభ వీరందరికీ ప్రాతినిధ్యం వహించేదిగా వుండాలి. కాని అసెంబ్లీలో గెలిచిన 294 మంది అభ్యర్ధులకీ వచ్చిన ఓట్లు కేవలం 1,72,43,593 మాత్రమే. వేసిన ఓట్లలో కేవలం 40 శాతానికి మాత్రమే రాష్ట్ర శాసనసభ ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఓటు వేసిన మిగిలిన 60శాతం ఓట్లు అంటే

2,48,14,853 మంది ఓట్లు వేసినా ప్రాతినిధ్యం లభించలేదు. ఇవి ఓడిన అభ్యర్థుల ఓట్లు. నియోజకవర్గం స్థాయిలోనే మురిగిపోయాయి. ఓటు వేసినా చట్టసభలో ప్రాతినిధ్యం లేనందువల్లనే చట్టసభలు రానురాను ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయి.

ఇదే దామాషా పద్ధతి ఎన్నికలలోనైతే పార్టీలకు వచ్చిన ఓట్లశాతం ఆధారంగా పార్టీలకు సీట్లు దక్కేవి. వేసిన ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం లభించేది. అప్పుడు చట్టసభలో ఈ పార్టీల బలాబలాలు వేరుగా వుండేవి.

## తగిన అభ్యర్థిని ఎంచుకునే స్వేచ్ఛ

నియోజకవర్గాలలో మంచి అభ్యర్థుల్నిఎన్నుకోవాలన్న భావనలో ఎవరికీ భిన్నాభిప్రాయాలు వుండవు. ఎన్నికల వ్యవస్థ అలాంటి అవకాశాన్ని కల్పించాలి. ప్రస్తుతం వున్న ఒక్క ఓటు మెజారిటీ వ్యవస్థతో పౌరులకి ఒకటే ఓటు వుంటుంది. మంచి అభ్యర్థి వున్నాడని వేరే పార్టీ అభ్యర్థికి వేస్తే తన పార్టీ నష్టపోతుంది. అభ్యర్థి ఎలాంటి వాడైనా పార్టీ కోసం ఓటువేస్తే మంచి అభ్యర్థికి అవకాశం రాకుండా పోతుంది. ఈ వ్యవస్థలో పార్టీలకు అభ్యర్థులు కీలకం. సమాజహితం కోరే అభ్యర్థి కంటే గెలుపు గుర్రాలే పార్టీలకి అవసరం. ఎన్నిఓట్లు వచ్చినా గెలవకపోతే పార్టీ నష్టపోతుంది. అందుచేత పార్టీలు ధనబలం, కండబలం, కులబలం అభ్యర్థులకే మొగ్గుచూపడం తప్పనిసరి అయింది.

మిశ్రమ సభ్యత్వ దామాషా ఎన్నికల పద్ధతిలో ప్రతిపౌరుడికీ రెండు ఓట్లు వుంటాయి. ఒక ఓటు పార్టీకి, మరోఓటు నియోజకవర్గంలో అభ్యర్థికి వేసుకునే వీలువుంది. అంతేకాకుండా ఒక ఓటరు తన పార్టీకి ఓటు వేసి, నియోజకవర్గంలో మరో పార్టీ అభ్యర్థికి ఓటు వేసినా తన పార్టీకి ఎలాంటి నష్టమూ రాదు. ఎందుకంటే అంతిమంగా పార్టీలకి వచ్చిన ఓట్ల శాతం ఆధారంగానే ఆ దామాషాలోనే సీట్లు వస్తాయి. ఉదాహరణకి ఒక శాసనసభలో 300 స్థానాలువుంటే ఆ రాష్ట్రంలో 150 నియోజకవర్గాలుగా విభజించి మరో 150 స్థానాలు పార్టీలిస్టుకు వీలు కల్పిస్తారు. అంటే పార్టీలు 150 మంది నియోజకవర్గ అభ్యర్థుల్ని 150 మంది పార్టీ జాబితాతో ఎన్నికల బరిలో వుంటాయి. మిశ్రమ సభ్యత్వ దామాషా ఎన్నికల పద్ధతిలో ఒక పార్టీకి 10 శాతం ఓట్లు వస్తే 300 స్థానాలలో ఆ పార్టీకి 30 సీట్లు వస్తాయి. ఇందులో నియోజకవర్గం నుండి ఎన్నికైన వారు ఆ పార్టీ నుండి 10 మంది వుంటే

మరో 20 మందిని పార్టీ జబితా నుండి జతచేస్తారు. అలాగే ఒకవేళ ఒక అభ్యర్థి మాత్రమే నియోజకవర్గంలో ఎన్నికైతే 29 మందిని పార్టీ జాబితా నుండి జతచేస్తారు. నియోజకవర్గాలలో ఎంతమంది అభ్యర్థులు గెలిచినా, ఓడినా, ఆ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం ప్రకారం సీట్లు లభిస్తాయి. ఈ పద్ధతివల్ల ఓటరు తన పార్టీకి ఓటు వేసుకుని నియోజకవర్గంలో మరో అభ్యర్థికి ఓటు వేసినా ఆ పార్టీకి ఎలాంటి నష్టం రాదు. ఓటర్లకి తమ పార్టీని, నియోజకవర్గంలో మంచి అభ్యర్థి ఎంపికకు ఈ వ్యవస్థ వీలు కల్పిస్తుంది. అభ్యర్థుల ప్రాధాన్యత తగ్గడంతో పార్టీలు గెలుపుగుర్రాల కోసం వెంపర్లాట తగ్గుతుంది. మంచి అభ్యర్థులను బరిలోకి దించే వీలు కలుగుతుంది.

## విధానాలపరంగా సంఘర్షణ


ఇక మూడవదీ చివరిదీ. ఒక్క ఓటు మెజారిటీ ఎన్నికల వ్యవస్థ పార్టీలలో సిద్ధాంత రాహిత్యానికి, విధానాల లేమికి, అభివృద్ధి వ్యూహాల శూన్యతకీ దారులు వేసింది. పార్టీలకు గెలిచే అభ్యర్థులు ప్రధానం కావడం, వారి స్థానిక స్థానబలిమి మీద ఆధారపడడంతో పార్టీల వ్యవస్థ బలహీనపడింది. పార్టీ, జెండా ఇప్పుడు అభ్యర్థులకు ఎన్నికల్లో ఒక సహాయ సాధనంగా మారింది. పార్టీల తెరచాటు వున్నప్పటికీ నియోజకవర్గ స్థాయిలో సమీకరణాల మధ్య సంఘర్షణగా అది పరిణమిస్తున్నది. స్థానిక గెలుపు ప్రధానం గనుక పార్టీలు దానిని ప్రోత్సహిస్తున్నాయి.

రాజకీయ సంఘర్షణ పార్టీల మధ్య, వాటి సిద్ధాంతాల మీద, విధానాల మీద అభివృద్ధి వ్యూహాలమీద జరగాలి. దామాషాపద్ధతి ఎన్నికలలో పార్టీకి వచ్చే ఓట్లే అంతిమంగా సీట్లను తెచ్చిపెడతాయి. అందుచేత పార్టీలకు విధానపరమైన సంఘర్షణ తప్పనిసరి అవుతుంది.

మొత్తంమీద ఏ ఎన్నికల వ్యవస్థా పరిపూర్ణంకాదని అందరూ అంగీకరిస్తారు. కాని ఒక్క ఓటు మెజారిటీ వ్యవస్థ కంటే దామాషా పద్ధతి మెరుగైనదీ ప్రజాస్వామ్య పరిపుష్టికి దోహదం చేసేది అని నిస్సందేహంగా చెప్పవచ్చును. అందుచేత ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో అరకొర మార్పుల మీద, చిల్లర సంస్కరణల మీద చర్చకు స్వస్తి చెప్పి కొత్త ఎన్నికల వ్యవస్థకోసం ఉద్యమించడం శ్రేయస్కరం. ◆

# రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజలది. ప్రజలు నేరుగా అధికారాన్ని చలాయించలేరు. ప్రజలనీ అధికారాన్నీ అనుసంధానం చేసే సాధనాలు వుండాలి. రాజకీయ పార్టీలు అలాంటి సాధనాలు. ప్రజల తరపున అధికారం నిర్వహించే సాధనాలు. అంటే ప్రజల కోసం పార్టీలు గాని పార్టీల కోసం ప్రజలు కాదు. ప్రజలను రాజకీయ విధానాల ప్రాతిపదిక మీద చైతన్యపర్చడం, సంఘటితపర్చడం, ప్రజాభిప్రాయం ఆధారంగా ఎన్నికల్లో గెలవడం, గెల్చిన తర్వాత ఆ విధానాలకు అనుగుణంగా ప్రజలిచ్చిన అధికారాన్ని వినియోగించడం పార్టీల పాత్రగా వుంటుంది. ప్రజల ఉమ్మడి అవసరాల కోసం ఏర్పడినదే పార్టీల వ్యవస్థ. కాని ప్రస్తుతం మనం చూస్తున్న పార్టీల వ్యవస్థ దీనికి పూర్తి విరుద్ధంగా వుంది. ఇవి కొన్ని కుటుంబాల ప్రయివేటు ఆస్తులుగా, కొందరి వ్యక్తుల స్వంత ఎస్టేట్లుగా, నాయకత్వ ముఠాల అడ్డాలుగా వుంటున్నాయి. ఈ పార్టీలు ప్రజల చేతుల్లో అధికార సాధనాలు కాకుండా కొన్ని



కుటుంబాలకు, వ్యక్తులకు, రాజకీయ ముఠాలకు అధికార క్రీడలో సాధనాలు అయ్యాయి. ఈ లక్షణాలు గల పార్టీలు పోషించే పాత్ర నిజమైన రాజకీయం కాదు. వీరిది రాజకీయ వ్యాపారం. ఈ ప్రైవేటు కంపెనీలు, వాటి అభ్యర్థులు ప్రజల్ని ప్రలోభపెట్టడం, ఓట్లు కొనడం, అధికారం పొందడం ప్రభుత్వ ధనాన్ని సంపదని కొల్లగొట్టుకుని పంచుకోవడంగా మారింది. పార్టీల పాత్ర మారింది. ఈ మార్పుని నిరోధించాలి. సమాజహితం కోసం, ప్రజస్వామ్యాన్ని అర్థవంతం చెయ్యడం కోసం పార్టీల వ్యవస్థను ప్రక్షాళన చెయ్యాలి. ఇందులో పార్టీల నియంత్రణ చట్టం అత్యంత కీలకమైంది.

రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చెయ్యాలి. మరింత విస్తృతపర్చాలి. ప్రజల సాధికారతకు పెద్దపీట వెయ్యాలి. ఇది జరగాలంటే పాలనలో ప్రజలకు ప్రత్యక్ష భాగస్వామ్యం కల్పించాలి. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. పరిపాలనను ప్రజలకు జవాబుదారీ చెయ్యాలి. పాలనా సమాచారాన్ని ప్రజల ఆస్తిగా ప్రకటించాలి. ప్రజలు యజమానులు, పాలకులు సేవకులు అన్నది ఆచరణలో కనిపించాలి.

ఇది జరగాలంటే ముందుగా పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసేవి కావాలి. పార్టీల ఇంట్లో నియంతృత్వము, బైట పాలనలో ప్రజాస్వామ్యమూ అనేవి పొసగని అంశాలు. పార్టీలోనే అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అందించలేని పార్టీలు దేశంలో ప్రజలకి ప్రజాస్వామ్యాన్ని పంచిపెట్టలేవు. నిజమైన అర్థంలో ప్రజల సాధికారతనీ, ప్రజల భాగస్వామ్యాన్ని అందించలేవు.

రాజకీయపార్టీలకు మంచి నిబంధనావళులుంటాయి. సభ్యులు, కమిటీలు, అంతరంగిక ఎన్నికల పద్ధతులు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలూ విధులకు సంబంధించిన అంశాలు అన్నీ పొందుపర్చబడి వుంటాయి. ఎవరైనా ప్రశ్నిస్తే అప్పుడు ఈ నిబంధనావళి దుమ్ము దులిపి తమ తమ పార్టీలలో ప్రజాస్వామ్య పద్ధతులను వివరించడానికి వినియోగించడం తప్ప ఏ పార్టీ కూడా నిబంధనావళి ప్రకారం పనిచేస్తున్న దాఖలాలు మాత్రం లేవు.

కొన్ని కుటుంబాలు, కొందరు వ్యక్తులు ప్రారంభించిన పార్టీలకు ఎంత మంచి నిబంధనావళి వున్నా అది ఆ కుటుంబం చుట్టూ, వ్యక్తులచుట్టూనే తిరుగుతుంది. అలాగే ఉత్తమ ఆశయాలతో ప్రారంభమైనా పార్టీలో ఆంతరంగిక ముఠాల చుట్టూ లేదా వ్యక్తుల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురిస్తుంది. మన దేశంలో రాజకీయ పార్టీలన్నీ

ఆంతరంగిక ప్రజాస్వామ్యంలో నేతి బీరకాయలే. మన రాష్ట్రంలో పార్టీలనే తీసుకోండి. ఇందులో కొత్త, పాత తేడాలు లేవు. అన్నీ అడ్‌హాక్ కమిటీల పార్టీలే. ఆ కుటుంబాల చుట్టూ లేదా వ్యక్తుల చుట్టూ లేదా నాయకత్వ ముఠాల చుట్టూ తిరుగుతున్న పార్టీలే. ఇక వామపక్ష పార్టీలలో క్రమపద్ధతిలో ఎన్నికలు వున్నట్టు కనిపిస్తున్నా కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఆ పార్టీలలో ఆంతరంగిక ప్రజాస్వామ్యాన్ని కుంచింపజేస్తున్నది. పర్యవసానంగానే ఆ పార్టీలలో కూడా తిరుగుబాట్లు, క్రమ శిక్షణా రాహిత్యాలు, ముఠా కీచులాటలు బైటకొస్తున్నాయి.

ప్రజలకు అధికారాన్ని అందించే సాధనాలుగా ప్రారంభమైన పార్టీలు ఇప్పుడు తమ పాత్రని మార్చుకున్నాయి. తమ వేషాల్ని రూపాన్ని మార్చుకున్నాయి. ప్రజలదే అధికారం అన్న అంశాన్ని పార్టీలదే అధికారం అన్న అంశంగా చూపిస్తున్నాయి. పార్టీలు అధికారం పొందడానికి ప్రజల్ని సాధనాలుగా చేస్తున్నాయి. ఇప్పుడు ప్రజలకోసం పార్టీలు కాదు. అధికారం కోసం పార్టీలు. మన ప్రజాస్వామ్యంలో ప్రజల అధికారం స్థానాన్ని పార్టీలు అధికారంగా రూపాంతరం చెందించారు. ప్రజలని కూడా ఇది ప్రజస్వామ్యమని ప్రభమింపచేస్తున్నారు. పార్టీలు ఈ కొత్త పాత్ర పోషించడానికి మనీకల్చర్‌ను ఆశ్రయిస్తున్నాయి. పార్టీ నడపడానికి డబ్బు, నేతలు కావడానికి డబ్బు, అభ్యర్థులుగా పోటీ చెయ్యడానికి డబ్బు ప్రస్తుతం పార్టీల వ్యవస్థ పూర్తిగా డబ్బు చుట్టూ తిరుగుతున్నది. ఈ డబ్బు ఐచ్ఛికంగా వచ్చేది కాదు. ఆశించి ఇచ్చేది. అధిక లాభాలకు పెట్టే పెట్టుబడి. డబ్బుంటే ఎవరైనా ఏ వ్యాపారం అయినా లాభసాటిగా నిర్వహించవచ్చు. ఏ అర్హతలు అవసరం లేదు. ఇదే రాజకీయ వ్యాపారానికీ సూత్రం అయింది. అయినా వీళ్లకి పార్టీ కావాలి. ఒకరి అండదండలు మరొకరికి కావాలి. పార్టీ వాళ్ళకి ఒక సాధనం. ఒక పరిచారిక మాత్రమే. ఇలాంటి నేపథ్యంలో పార్టీలో ప్రజస్వామ్యం ఉండదు. ఉండకూడదు. ఒక ముఠా కల్చర్, ఒక బ్యూరోక్రాటిక్ మేనేజిమెంట్ కల్చర్, ఒక కార్పొరేట్ కల్చర్ ఏదైనా లేక అన్నింటి మిశ్రమంతో పార్టీల నిర్వహణ సాగిపోతుంది. ఇదే ప్రస్తుతం మన పార్టీలలో చూస్తున్నాం. ఈ పార్టీలకి రాజకీయ విధానాలతో పని వుండదు. ప్రజల్ని చైతన్య పరిచే అవసరం ఉండదు. డబ్బుల్లో ప్రజల్ని ప్రలోభపెట్టడం, కొనుగోలు చెయ్యడం, మేనేజ్ చెయ్యడం మాత్రమే రాజకీయం అవుతుంది. పార్టీలు డబ్బు చుట్టూ, అధికారం చుట్టూ తిరుగుతాయి. ఇదీ మనం చూస్తున్న స్థితి. ఈ పద్ధతి

పార్టీలను నిలబెట్టుకోడానికి పనికొస్తుంది. వ్యక్తులు, కుటుంబాలు, రాజకీయ ముఠాల ప్రయోజనాలకు పనికి వస్తుంది. ప్రజల ప్రయోజనాలకి, ప్రజాస్వామ్య విస్తృతికి ఎంత మాత్రం పనికి రావు.

ఈ నేపథ్యంలో రాజకీయపార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పాలి. మన రాజ్యాంగ నిర్మాతలు రాజకీయ పార్టీల ఏర్పాటుకీ, పత్రికల నిర్వహణకీ చట్టాలు అవసరం వస్తుందని భావించలేదు. అవి ప్రజలకు దిక్సూచిగా, ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలుగా విరాజిల్లుతాయని భావించారు. కాని ఈ వ్యవస్థలు పూర్తిగా వ్యాపార రంగాలుగా మారిపోతాయని సంకుచితమైన స్వార్ధ ప్రయోజనాలకు ఆలవాలమై పోతాయని వారు ఊహించలేదు. కాని ఇప్పుడు అలాంటి అవసరం అందరికీ సుస్పష్టంగా కనిపిస్తున్నది. రాజకీయ పార్టీల నియంత్రణకు చట్టం తప్పనిసరి అవసరం అయింది.

## పార్టీల చట్టం దేని కోసం..

రాజకీయ పార్టీలకు చట్టం అవసరం అంటే పార్టీలు పెట్టుకునే స్వేచ్ఛను హరించడమూ కాదు, నియంత్రించడమూ కాదు. ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన రాజకీయ పార్టీలలో ప్రజాస్వామ్యాన్ని తప్పనిసరి చెయ్యడం కోసం మాత్రమే. ప్రజల అధికారానికి సాధనాలు కావలసిన పార్టీలు, వ్యక్తుల ఎస్టేట్లుగా, కుటుంబ ఆస్తులుగా, రాజకీయ ముఠాల అడ్డాలుగా మారకుండా నిరోధించడానికి మాత్రమే.

### 1. సభ్యుల హక్కుల పరిరక్షణ

ప్రతి రాజకీయ పార్టీ తాను సభ్యుల మీదే ఆధారపడినట్లు చెప్పుకుంటుంది. కాని పార్టీలో సభ్యుల హక్కుల పరిరక్షణకు నిర్దిష్టమైన ఏర్పాట్లు సమగ్రమంగా వుండడం లేదు.

ఒక పార్టీలో ఎవరిని సభ్యులుగా చేర్చుకోవాలి. ఎవరిని చేర్చుకోకూడదు అని నిర్దేశించుకునే హక్కు ఆయా పార్టీలకే వుండాలి. ఇది పార్టీల స్వేచ్ఛ. వాటి ప్రాధిమిక హక్కు చట్టం దీనిని నియంత్రించకూడదు.

ఒక పార్టీలో సభ్యత్వం ఇచ్చిన తర్వాత వారికి నిర్దిష్టమైన హక్కులు వుండి తీరాలి. అవి పొందడానికి ఖచ్చితమైన ఏర్పాట్లు వుండాలి. దీనికి రక్షణ ఇచ్చే చట్టబద్ధమైన చర్యల కోసం పార్టీల నియంత్రణ చట్టం అవసరం.

ప్రతి పార్టీలోనూ సభ్యులకు ఈ కింది హక్కుల్ని విధిగా కల్పించి తీరాలి.

ఎ. సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడానికి నిర్దిష్టమైన వేదికలు వుండాలి.

బి. సంస్థాగత ఎన్నికలు నిర్దిష్ట కాలపరిమితిలో జరిగి తీరే ఏర్పాటు, సభ్యులకు పోటీ చేసే అవకాశాలు పార్టీలకు తప్పనిసరి చెయ్యాలి.

సి. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నిర్ణయం ఆయా ప్రాంతానికి చెందిన పార్టీ సభ్యులకే వుండాలి. పై కమిటీలకుఅభ్యర్థిత్వాన్ని వీటో చేసే అధికారం, అభ్యర్థిని సూచించే అధికారాలున్నా అంతిమంగా నిర్ణయాధికారం ఆ ప్రాంత సభ్యులదే కావాలి.

డి. పార్టీ సభ్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోడానికి నిర్దిష్టమైన ఏర్పాట్లు వుండాలి. సహజన్యాయ సూత్రాలు పాటించి తీరాలి.

ఇవి సభ్యుల ప్రాథమిక హక్కులు కావాలి. వీటిని పార్టీలే అమలు జరుపుకోవాలి. కాని ఈ హక్కుల ఉల్లంఘనలు జరిగితే పార్టీల నియంత్రణా చట్టం ఈ సభ్యుల హక్కులను రక్షించేదిగా వుండాలి. ఉల్లంఘించిన పార్టీలను శిక్షించే అధికారం గల చట్టం కావాలి.

## 2. సంస్థాగత ఎన్నికలు

ఎ. ప్రతిపార్టీ తన సంస్థాగత ఎన్నికల పద్ధతిని నిబంధనావళిలో నిర్దిష్టంగా పేర్కొని తీరాలి. ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ వుండాలి. గడువులోగా ఎన్నికలు జరిపితీరాలి. ఏదైనా అసాధారణ పరిస్థితుల వల్ల గడువు మారితే కనీసం 6 నెలలలోగా విధిగా ఎన్నికలు జరిగి తీరాలి. ఈ అదనపు గడువు కాలంలో పాత కమిటీలే కొనసాగాలి. అడ్‌హాక్ కమిటీలు వుండకూడదు.

బి. సంస్థాగత ఎన్నికల ప్రకటనకు ముందస్తు ప్రకటన, ఓటర్ల జాబితాల ప్రకటన, నామినేషన్ల స్వీకరణ, రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరగాలి.

సి. అన్ని స్థాయిలలోనూ నామినేటెడ్ పోస్టులు 1/4కు మించి ఉండకూడదు. వీరికి ఓటింగు హక్కు వుండకూడదు.

సంస్థాగత ఎన్నికలు సకాలంలో జరగకపోయినా, నిబంధనావళిని ఉల్లంఘించినప్పుడు ఆ పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు తరహా కఠినమైన చర్యలు తీసుకోవడానికి పార్టీల నియంత్రణ చట్టం అధికారాన్ని కలిగి ఉండాలి.

### 3. ఎన్నికైన కమిటీలు

ఎ. ఎన్నికైన పార్టీ కమిటీలను మూకుమ్మడిగా రద్దు చేసే అధికారం వాటి స్థానంలో అడ్‌హాక్ కమిటీల ఏర్పాటు చేసే అవకాశం ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించకూడదు.

బి. ఏదైనా ఒక కమిటీ నిబంధనావళిని ఉల్లంఘించినప్పుడు దానికి నిర్దిష్టమైన కారణాలతో నోటీసు ఇచ్చి వారు ఇచ్చిన వివరణ తర్వాత వాటి మీద ఆంక్షలూ చర్యలు మాత్రమే వుండాలి.

సి. ఎన్నికైన కమిటీల రద్దును నిరోధించడానికి పార్టీల నియంత్రణ చట్టంలో తగిన రక్షణ చర్యలు వుండాలి.

### 4. విశేషాధికారాలు

పార్టీ అధ్యక్షుడు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎన్నికైనా ఆయన విశేషాధికారాలను పరిమితం చెయ్యాలి. నియంతగా వ్యవహరిచడానికి ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించకూడదు. పార్టీల నిబంధనావళిలో అలాంటి నిబంధనలను చట్టం విరుద్ధం చెయ్యాలి. సభ్యులను, నాయకుల్ని ఏకపక్షంగా తొలగించే అధికారం, ఎన్నికైన కమిటీలను రద్దు చేసే అధికారం వుండకూడదు. నిబంధనావళిలో సూచించిన పద్ధతిని పాటించి తీరాలి.


నిబంధనావళికి విరుద్ధంగా నామినేషన్ల ద్వారా సంస్థాగత ఎన్నికలను అపహాస్యం చేయడాన్ని అనుమతించకూడదు. అధ్యక్షుని తుది నిర్ణయానికి వదిలేశామని ఏ కమిటీ కూడా ఏకవాక్య తీర్మానాలు చేయడాన్ని అనుమతించకూడదు. నిబంధనావళికి, చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినట్లు రుజువైతే ఆ పార్టీ అధ్యక్షుణ్ణి అనర్హుణ్ణి చేసే అధికారం పార్టీ నియంత్రణ చట్టానికి వుండాలి.

### 5. పార్టీ అభ్యర్థుల ఎన్నిక :

ఏ స్థాయిలోనైనా ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులను నిర్ణయించే అధికారం ఆ స్థాయిలో పార్టీ సభ్యులకే వుండాలి. పై కమిటీలకి అధ్యక్షునికి అభ్యర్థుల్ని సూచించే అధికారం లేదా ఆ ప్రాంత సభ్యులు సూచించిన అభ్యర్ధిని తిరస్కరించే అధికారాలు వున్నప్పటికీ అంతిమంగా అభ్యర్థుల్ని నిర్ణయించే అధికారం ఆ ప్రాంత సభ్యులకే వుండాలి.

## 6. పార్టీ నిధులు :

నిధుల సేకరణ – జమాఖర్చులు పారదర్శకంగా ఉండే ఏర్పాట్లు పార్టీలు చేసుకోవాలి. చట్టబద్ధమైన వసూళ్ళకీ, చట్టబద్ధమైన ఆర్థిక కార్యకలాపాలను అరికట్టేందుకు పార్టీల నియంత్రణ చట్టం తగిన చర్యలు తీసుకునేదిగా వుండాలి. పార్టీల నియంత్రణ చట్టం పైకి పార్టీలను కట్టడిచేసేదిగా కనిపించినా ఇది పార్టీలలో అంతరంగిక ప్రజాస్వామ్యాన్ని నికరం చెయ్యడానికి ఉద్దేశించింది. అన్ని పార్టీలలో సభ్యుల సాధికారతకు సంబంధించినది. అందుచేత అన్ని పార్టీలలోని సభ్యులు దీని మీద స్పందించాలి. పార్టీలను సంస్కరించే ఉద్యమంలో భాగస్వాములు కావాలి. అలాగే ఈ సమస్యను పార్టీల సమస్యగా ప్రజలు భావించకూడదు. ప్రజాస్వామ్య బద్ధం కాని పార్టీలు తెచ్చే అనర్ధం అంతా భరిస్తుంది ప్రజలు. ప్రజల సాధికారత అంతిమంగా పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యంతో ముడి పడి ఉంది. ఈ చర్చను కొనసాగించండి... దీనిని ఉద్యమం చెయ్యండి..!! ◆



Shyam Mohan

# ఆంధ్రప్రదేశ్ సంగ్రహ స్వరూపం

## 2011- జనాభా లెక్కలు

రాష్ట్రంలో జిల్లాలు : 23

మండలాలు : 1,128

మునిసిపాలిటీలు : 125 పంచాయితీలు : 21,176

గ్రామాలు, ఆవాసాలు : 27,800

**మొత్తం జనాభా : 8,46,65,533**

పురుషులు : 4,25,09,881 స్త్రీలు : 4,21,55,652

గ్రామీణజనాభా : 5,63,11,788 పట్టణజనాభా : 2,83,53,745

గ్రామాలలో వృద్ధిరేటు :1.64 పట్టణాలలోవృద్ధిరేటు : 36.26

1000 మంది పురుషులకీ స్త్రీలు : 992

1000 మంది పురుషులకీ పట్టణ ప్రాంతంలో : 984

1000 మంది పురుషులకీ గ్రామీణ ప్రాంతంలో : 995

0-6 సంవత్సరాల మధ్య వున్న పిల్లలు : 86,42,686

బాలురు : 44,48,330 బాలికలు : 41,94,356

ప్రతి 1000 మంది బాలురకి బాలికలు : 943

పట్టణ ప్రాంతాలలో : 946 గ్రామీణ ప్రాంతంలో : 942

అక్షరాస్యులు మొత్తం : 5,14,38,510

పురుషులు : 2,87,59,782 స్త్రీలు: 2,26,78,728

అక్షరాస్యత శాతం : 67.66

పురుషులలో : 75.56 స్త్రీలలో : 59.74

పట్టణ ప్రాంతంలో : 80.54 గ్రామీణ ప్రాంతంలో : 61.14

# జిల్లాలవారీ జనాభా, స్థూలఉత్పత్తి, ఆదాయం, పంచాయతీలు

| క్రస | జిల్లాలు | జనాభా 2011 | స్థూల ఉత్పత్తి (లక్షలలో) | తలసరి ఆదాయం (2009-10) | పంచాయతీల సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1 | అదిలాబాద్ | 27,37,738 | 9,83,319 | 31,333 | 866 |
| 2. | నిజామాబాద్ | 25,52,073 | 8,82,233 | 30,227 | 718 |
| 3. | కరీంనగర్ | 38,11,738 | 13,90,838 | 32,289 | 1194 |
| 4. | మెదక్ | 30,31,877 | 15,69,987 | 45,111 | 1109 |
| 5. | హైదరాబాద్ | 40,10,238 | 30,98,440 | 63,595 | 0 |
| 6. | రంగారెడ్డి | 52,96,396 | 27,32,537 | 53,234 | 705 |
| 7. | మహబూబ్‌నగర్ | 40,42,191 | 11,88,010 | 28,131 | 1348 |
| 8. | నల్గొండ | 34,83,648 | 13,96,702 | 34,766 | 1178 |
| 9. | వరంగల్ | 35,22,644 | 10,73,644 | 27,291 | 1014 |
| 10. | ఖమ్మం | 27,98,214 | 11,83,007 | 36,903 | 771 |
| 11. | శ్రీకాకుళం | 26,99,471 | 7,34,405 | 24,455 | 1101 |
| 12. | విజయనగరం | 23,42,868 | 7,03,944 | 27,157 | 929 |
| 13. | విశాఖపట్నం | 42,88,113 | 25,01,850 | 50,976 | 944 |
| 14. | తూర్పుగోదావరి | 51,51,549 | 22,60,718 | 39,002 | 1012 |
| 15. | పశ్చిమగోదావరి | 39,34,782 | 14,93,625 | 33,712 | 888 |
| 16. | కృష్ణా | 45,29,009 | 22,46,638 | 44,398 | 972 |
| 17. | గుంటూరు | 48,89,230 | 18,21,830 | 34,949 | 1016 |
| 18. | ప్రకాశం | 33,92,764 | 13,20,498 | 36,593 | 1036 |
| 19. | **SPSR** నెల్లూరు | 29,66,082 | 11,54,116 | 36,470 | 961 |
| 20. | **YSR** కడప | 28,84,524 | 9,88,128 | 31,476 | 800 |
| 21. | కర్నూలు | 40,46,601 | 12,84,203 | 29,548 | 899 |
| 22. | అనంతపురం | 40,83,315 | 14,08,056 | 31,847 | 1001 |
| 23. | చిత్తూరు | 41,70,468 | 13,17,647 | 28,983 | 1381 |
| ఆంధ్రప్రదేశ్ మొత్తం | | **84,665,533** | **3,47,34,373** | **37,061** | **21,843** |

## నగరాలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు, మండలాలు, పంచాయితీలు

| | | |
|---|---|---|
| 1) గ్రేటర్ హైదరాబాద్ మొత్తం ఆదాయం | : | 1,799.93 కోట్లు **(2010-11)** |
| మొత్తం ఖర్చు | : | 1,859.79 కోట్లు |
| 2) 15 కార్పొరేషన్ల మొత్తం ఆదాయం | : | 1,884.25 కోట్లు |
| మొత్తం ఖర్చు | : | 1,520,28 కోట్లు |
| 3) 22 జిల్లా పరిషత్‌ల మొత్తం ఆదాయం | : | 1,511.98 కోట్లు |
| మొత్తం ఖర్చు | : | 1,021.98 కోట్లు |
| 4) 1097 మండల పరిషత్‌ల మొత్తం ఆదాయం | : | 668.66 కోట్లు |
| మొత్తం ఖర్చు | : | 648.72 కోట్లు |
| 5) 21,207 పంచాయితీలు మొత్తం ఆదాయం | : | 995.26 కోట్లు |
| మొత్తం ఖర్చు | : | 879.78 కోట్లు |

(ఆధారం : డైరక్టరేట్ ఆఫ్ స్టేట్ ఆడిట్, హైదరాబాద్)

### చట్టసభలలో స్థానాలు

| | | | |
|---|---|---|---|
| రాష్ట్రంలో శాసనసభా స్థానాలు | 294 | శాసనమండలి స్థానాలు | 90 |
| లోక్‌సభ స్థానాలు | 42 | రాజ్యసభ స్థానాలు | 18 |

## రాష్ట్రంలో శ్రామికులు, వ్యవసాయదారులు

| | |
|---|---|
| మొత్తం శ్రామికులు | 3,48,93,859 |
| ప్రధాన శ్రామికులు | 2,90,40,873 |
| వ్యవసాయదారులు | 78,59,534 |
| వ్యవసాయ కూలీలు | 1,38,32,152 |
| కుటీర పరిశ్రమలు | 16,42,105 |
| ఇతర శ్రామికులు | 1,15,60,068 |
| శ్రామికులు కానివారు | 4,13,16,148 |

## పంటభూములు, నీటివసతి

| | |
|---|---|
| స్థూల పంటసాగు విస్తీర్ణం | 1,25,60,466 (హెక్టార్లు) |
| నికర పంటసాగు విస్తీర్ణం | 99,91,455 (హెక్టార్లు) |
| స్థూలసాగునీటి వసతి | 57,63,957 |
| నికర సాగునీటి వసతి | 42,14,338 |

# రాష్ట్రంలో కుటుంబాలు, వసతులు

## (2011 జాతీయ సెన్సెస్ ఆధారంగా)

| | | | |
|---|---|---|---|
| **1. రాష్ట్రంలో మొత్తం కుటుంబాలు** | : | 2,10,24,534 | |
| గ్రామీణ కుటుంబాలు | : | 1,42,46,309 | |
| పట్టణాలలోని కుటుంబాలు | : | 67,78,225 | |
| **2. కుటుంబాల ఇళ్ల పరిస్థితి** | | మొత్తం కుటుంబాలు : 2,10,24,534 | |
| మంచి ఇళ్లు | : | 1,46,61,416 | (69.7%) |
| నివాసయోగ్యమైనవి | : | 56,27,525 | (26.8%) |
| శిధిలావస్థలో వున్న | : | 7,35,593 | (3.5%) |
| **3. మొత్తం కుటుంబాలు** | : | 2,10,24,534 | |
| 1-2 సభ్యుల కుటుంబాలు | : | 39,22,867 | |
| 3-4 సభ్యులు గల కుటుంబాలు | : | 1,01,25,458 | |
| 5 మంది సభ్యుల కుటుంబాలు | : | 37,61,358 | |
| 6-8 మంది కుటుంబాలు | : | 28,62,769 | |
| 9 పై బడిన కుటుంబాలు | : | 3,52,082 | |
| **4. మంచినీటి వసతి - కుటుంబాలు** | | మొత్తం కుటుంబాలు : 2,10,24,534 | |
| శుద్ధి చేసిన కుళాయినీరు | : | 1,02,98,089 | (49%) |
| శుద్ధి చేయని కుళాయినీరు | : | 43,93,481 | (20.9%) |
| నూతినీరు | : | 13,35,457 | (6.4%) |
| చేతిపంపుల నీరు | : | 28,85,510 | (13.7%) |
| బోరు నీళ్లు | : | 14,51,570 | (6.9%) |
| చెరువులు, కాలువలు వగైరా | : | 5,60,427 | (3.2%) |
| **5. కుటుంబాలు - దీపాలు** | | మొత్తం కుటుంబాలు : 2,10,24,534 | |
| విద్యుత్ దీపాలు | : | 1,93,77,222 | (92.2%) |
| కిరోసిన్ | : | 14,50,876 | (6.9%) |
| ఇతరాలు (సోలార్, ఇతర తైలాలు) | : | 1,16,528 | (0.5%) |
| ఏ దీపం లేనివారు | : | 79,908 | (0.4%) |

**6. కుటుంబాలు – మరుగుదొడ్లు** మొత్తం కుటుంబాలు : 2,10,24,534

| | | | |
|---|---|---|---|
| ఇంటి ఆవరణలోవున్న కుటుంబాలు | : | 1,04,24,003 | (49.6%) |
| పబ్లిక్ మరుగుదొడ్లు | : | 5,15,370 | (2.5%) |
| బహిరంగ మలవిసర్జన | : | 1,00,85,161 | (48.%) |

**7. కుటుంబాలు – మురుగునీరు** మొత్తం కుటుంబాలు : 2,10,24,534

| | | | |
|---|---|---|---|
| భూమిలోపల డ్రయినేజీ వున్న | : | 45,31,727 | (21.6%) |
| బహిరంగమైన డ్రైయినులు | : | 74,32,297 | (35.4%) |
| ఏ డ్రయినేజీ వసతిలేని | : | 90,60,510 | (43.1%) |

**8. కుటుంబాలు – వంట చెరుకు** మొత్తం కుటుంబాలు : 2,10,24,534

| | | | |
|---|---|---|---|
| కట్టెలు | : | 1,19,50,542 | (56.8%) |
| కిరోసిన్ | : | 8,09,437 | (3.9%) |
| గ్యాస్ సిలిండర్లు | : | 75,25,445 | (35.8%) |
| బయోగ్యాస్ | : | 1,49,059 | (0.7%) |
| ఇతరత్రా | : | 5,90,051 | (2.8%) |

**9. కుటుంబాలు – వినియోగవస్తువులు** మొత్తం కుటుంబాలు : 2,10,24,534

| | | | |
|---|---|---|---|
| ఎ) రేడియోలున్న కుటుంబాలు | : | 19,49,681 | (9.3%) |
| బి) టెలివిజన్ వున్న కుటుంబాలు | : | 1,23,58,093 | (58.8%) |
| సి) టెలిఫోన్, మొబైల్‌ఫోన్లు | : | 1,32,62,317 | (63.1%) |
| డి) సైకిళ్లు వున్న కుటుంబాలు | : | 67,54,231 | (32.1%) |
| ఇ) స్కూటర్లు, మోటార్ సైకిళ్లు | : | 39,14,068 | (18.6%) |
| ఎఫ్) కార్లు, జీపులు, వ్యానులు | : | 5,62,769 | (2.7%) |
| జి) ఇలాంటి వస్తువులు లేని | : | 40,84,288 | (19.4%) |
| హెచ్)ఇంటర్‌నెట్ గల కంప్యూటర్లు | : | 5,49,284 | (2.6%) |
| ఐ) ఇంటర్‌నెట్ లేకుండా | : | 12,14,271 | (5.8%) |

(ఇక్కడ వివిధ వస్తువులు ఒకే కుటుంబంలో కూడా వుండడం వల్ల అంకెలు అదనంగా వుంటాయి.)

# రాష్ట్రంలో పాఠశాల విద్య (2011-12)

## (ప్రయిమరీ + అప్పర్ ప్రయిమరీ)

| .............. | మొత్తం పాఠశాలలు | ఉపాధ్యాయులు | పిల్లలు |
|---|---|---|---|
| ఎ) కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు | 114 | 2,318 | 1,459 |
| బి) రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు | 7,716 | 30,588 | 9,67,139 |
| సి) జిల్లా పరిషత్ మండల పరిషత్ | 66,393 | 2,50,079 | 60,84,261 |
| డి) మున్సిపల్ | 2,115 | 10,673 | 3,10,299 |
| ఇ) మున్సిపల్ | 2,115 | 10,673 | 3,10,299 |
| యఫ్) ప్రైవేటు | 22,762 | 1,87,833 | 54,10,872 |
| **మొత్తం** | **1,02,436** | **4,95,111** | **1,33,90,924** |

ప్రభుత్వ, జిల్లా పరిషత్/మండల పరిషత్ పాఠశాలలో

ఉపాధ్యాయులతోపాటు అదనంగా 51,284 మంది విద్యావలంటీర్లు వున్నారు

ఈ పాఠశాలలో బాలురు 68,30,538, బాలికలు 65,60,386

# రాష్ట్రంలో హైస్కూళ్లు

| వివరాలు | మొత్తం సంఖ్య | ఉపాధ్యాయులు | పిల్లలు |
|---|---|---|---|
| హైస్కూళ్లు | 18,776 | 2,05,179 | 53,97,690 |
| హైయ్యర్ సెకండరీ స్కూళ్లు | 173 | 4,304 | 1,26,870 |
| ప్రత్యేక విద్యాస్కూళ్లు | 5 | 7 | 61 |
| హిందీ, సంస్కృతం హైస్కూళ్లు | 61 | 371 | 8,534 |
| **మొత్తం** | **19,015** | **2,09,861** | **55,25,155** |

# రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలు

## వైద్యసేవలందించే ప్రభుత్వం ఆసుపత్రులు

| ఆసుపత్రులు | వైద్య విద్యా సంస్థల శాఖ | వైద్యవిధాన పరిషత్ | డైరక్టరేట్ ఆఫ్ హెల్త్ | బీమా వైద్యసేవలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1. ఎ) జనరల్ ఆసుపత్రులు | 14 | 17 | 63 | 11 | 105 |
| బి) ప్రత్యేక సేవలు గలవి | 25 | 4 | 6 | 0 | 35 |
| సి) అనుబంధ ఆసుపత్రులు | 1 | 180 | 107 | 51 | 339 |
| 2. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు | 10 | 0 | 1623 | 0 | 1633 |
| 3. పడకలు మొత్తం అన్నిరకాలు | 16,292 | 15,624 | 9,738 | 1,111 | 42,765 |
| 4. డిస్పెన్సరీలు | – | 26 | – | 144 | 170 |
| 5. ఎ) డాక్టర్లు | 4,450 | 1,225 | 2,391 | 355 | 8,421 |
| బి) కాంట్రాక్టు డాక్టర్లు | 43 | 287 | 303 | 379 | 1,012 |

**ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య గణాంకాలు (2010)**

1. మొత్తం జననాల రేటు (ప్రతి 1000 మంది జనాభాకి) 17.9
   గ్రామీణ ప్రాంతంలో 18.3 పట్టణ ప్రాంతంలో 16.7

2. మొత్తం మరణాల రేటు (ప్రతి 1000 మంది జనాభాకి 7.6
   గ్రామీణ ప్రాంతంలో 8.6 పట్టణ ప్రాంతంలో 5.4

3. శిశుమరణాల రేటు (ప్రతి 1000 మంది జననాలకు) 46
   గ్రామీణ ప్రాంతంలో 49 పట్టణప్రాంతంలో 33

(సమాచారం : డైరక్టరేట్ ఆఫ్ స్టాటిస్టిక్స్)

| ఏప్రిల్ 2010 | | | |
|---|---|---|---|
| | **ఆయుర్వేదం** | **యునానీ** | **హోమియోపతి** |
| ప్రభుత్వం ఆసుపత్రుల సంఖ్య | 559 | 196 | 287 |
| డాక్టర్ల సంఖ్య | 285 | 165 | 180 |
| ప్రభుత్వ సహాయంతో ఆసుపత్రులు | 7 | 0 | 0 |
| డాక్టర్లు | 6 | 0 | 0 |
| సేవలు పొందిన పేషెంట్లు | 48,17,853 | 25,75,734 | 25,59,092 |

# GOVERNMENT MEDICAL FACILITIES

## ALLOPATHIC, DISTRICT-WISE

(As on 31.3.2010)

| Sl. No. | District | No. of Primary Health Centres | No. of Beds Total | No. of Dispensaries | No. of Regular Doctors | No. of Contract Doctors |
|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (12) | (17) | (18) | (19) | (20) |
| 1. | Srikakulam | 73 | 1020 | 9 | 310 | 38 |
| 2. | Vizianagaram | 59 | 700 | 11 | 223 | 10 |
| 3. | Visakhapatnam | 83 | 2,832 | 12 | 627 | 16 |
| 4. | East Godavari | 84 | 2,472 | 36 | 522 | 84 |
| 5. | West Godavari | 68 | 1,136 | 11 | 170 | 54 |
| 6. | Krishna | 72 | 1,592 | 16 | 494 | 29 |
| 7. | Guntur | 73 | 2,423 | 13 | 580 | 39 |
| 8. | Prakasam | 81 | 1,164 | 10 | 304 | 58 |
| 9. | Nellore | 65 | 1,341 | 17 | 230 | 24 |
| 10. | Chittoor | 92 | 2,209 | 11 | 506 | 65 |
| 11. | Kadapa | 68 | 1,470 | 8 | 472 | 46 |
| 12. | Anantapur | 78 | 1,600 | 12 | 344 | 54 |
| 13. | Kurnool | 78 | 2,093 | 19 | 555 | 34 |
| 14. | Mahbubnagar | 86 | 1,120 | 3 | 213 | 55 |
| 15. | Ranga Reddy | 42 | 812 | 9 | 148 | 23 |
| 16. | Hyderabad | 0 | 6,882 | 56 | 1,438 | 39 |
| 17. | Medak | 67 | 1,136 | 13 | 197 | 44 |
| 18. | Nizamabad | 45 | 1,054 | 2 | 143 | 17 |
| 19. | Adilabad | 77 | 1,112 | 7 | 296 | 84 |
| 20. | Karimnagar | 72 | 1,203 | 6 | 205 | 48 |
| 21. | Warangal | 70 | 2,110 | 6 | 507 | 29 |
| 22. | Khammam | 76 | 899 | 3 | 156 | 52 |
| 23. | Nalgonda | 72 | 998 | 2 | 193 | 41 |
| | ANDHRA PRADESH | 1,581 | 39,378 | 292 | 8,833 | 983 |

Source: 1. Commissioner of Andhra Pradesh, Vaidhya Vidhana Parishad, Andhra Pradesh, Hyderabad.

అనుబంధం

# పంచాయితీలకు దఖలు పర్చాల్సిన విధులు

**(రాజ్యాంగం 11వ షెడ్యూలులో సూచించిన 29 అంశాలు)**

1. వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2. భూమి అభివృద్ధి, భూసంస్కరణలు అమలు, భూముల ఏకీకరణ, భూసార రక్షణ
3. చిన్న తరహా నీటి పారుదల, నీటి నిర్వహణ, నీటి వాలు అభివృద్ధి
4. పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ
5. మత్స్య పరిశ్రమ
6. సామాజిక అడవులు, చేలల్లో చెట్లు పెంచడం
7. చిల్లర ఆటవీ ఉత్పత్తులు
8. లఘు పరిశ్రమలు, ఆహార పదార్థాలను శుభ్రపర్చడం (ప్రాసెస్)
9. ఖాదీ, గ్రామ, కుటీర పరిశ్రమలు
10. గ్రామీణ గృహ నిర్మాణం
11. మంచినీరు
12. ఇంధనం, పశుగ్రాసం
13. రోడ్లు, వంతెనలు, ఫెర్రీలు, జలమార్గాలు, ఇతర రాకపోకల సాధనాలు.
14. గ్రామీణ విద్యుదీకరణ, విద్యుచ్ఛక్తి పంపకం
15. సంప్రదాయేతర విద్యుచ్ఛక్తి వనరులు
16. పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు
17. విద్య-ప్రాథమిక, సెకండరీ పాఠశాలలు
18. సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య
19. వయోజన, అనియత విద్య
20. గ్రంథాలయాలు
21. సాంస్కృతిక కార్యక్రమాలు
22. మార్కెట్లు, సంతలు
23. ఆరోగ్యం, పారిశుధ్యం, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

24. కుటుంబ సంక్షేమం
25. స్త్రీ, శిశు అభివృద్ధి
26. సాంఘిక సంక్షేమం, వికలాంగుల, బుద్ధి మాంద్యం కలవారి సంక్షేమం
27. బలహీన వర్గాల, అనుసూచిత వర్గాల, అనుసూచిత జాతుల సంక్షేమం
28. ప్రజాపంపిణీ వ్యవస్థ
29. సామాజిక సంపత్తుల నిర్వహణ

## మున్సిపాలిటీలకు దఖిలు పర్చాల్సిన విధులు

**(రాజ్యాంగం 12వ షెడ్యూలులో సూచించిన 18 అంశాలు)**

1. టౌన్‌ప్లానింగ్‌తో సహా అర్బన్‌ప్లానింగ్
2. భూమి వినియోగం, భవనాల నిర్మాణంపై నియంత్రణ
3. ఆర్థిక సామాజికాభివృద్ధి ప్రణాళికలు
4. రోడ్లు, బ్రిడ్జిలు
5. గృహ, పారిశ్రామిక, వాణిజ్య వినియోగాలకు నీటి సరఫరా
6. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, వ్యర్థపదార్థాల తొలగింపు
7. అగ్నిమాపక సేవలు
8. పట్టణ సామాజిక వనాలు, పర్యావరణ పరిరక్షణ, జీవావరణ సమతౌల్యత
9. వికలాంగులతో సహా సమాజంలోని బలహీనవర్గాల ప్రయోజనాల పరిరక్షణ
10. మురికి వాడల అభివృద్ధి మెరుగుదల
11. పట్టణ దారిద్ర్య నిర్మూలన
12. పార్కులు, వనాలు, ఆటస్థలాలు వంటి సౌకర్యాల కల్పన
13. విద్యా సాంస్కృతిక రంగాల అభివృద్ధి
14. స్మశాన వాటికల ఏర్పాటు, నిర్వహణ, విద్యుత్ స్మశాన వాటికల ఏర్పాటు
15. బందెల దొడ్లు, జీవహింస నిరోధం
16. జనన, మరణాల నమోదు, ఇతర ముఖ్య గణాంకాల నమోదు
17. వీధి దీపాలు, బస్‌స్టాపులు తదితర పౌర సౌకర్యాలు
18. కబేళాలు, తోళ్ళ పరిశ్రమలను నియంత్రించడం.

# సురాజ్య ఉద్యమం - కొన్ని నినాదాలు

కొందరి కోసం స్వాహారాజ్యం - అందరికోసం సురాజ్యం

రాయితీల బతుకుల కన్నా - ఎదిగే అవకాశాలే మిన్న

స్వాహారాజ్యం కూలుద్దాం - సురాజ్యం నిర్మిద్దాం

అవినీతి అంతం - లోక్‌సత్తా పంతం

ప్రభుత్వ సేవలలో లంచాలు పోవాలి - హక్కుగా ప్రజలకు సేవలందాలి

కొత్త లోకాయుక్త రావాలి - అవినీతి భరతం పట్టాలి

చెడ్డ రాజకీయాన్ని తుంచు - మంచి రాజకీయాన్ని పెంచు

నీతిపరులకి అధికారం - అవినీతిపరులకి కారాగారం

నిజాయితీకి పట్టం కడదాం - అవినీతికి గోరీ కడదాం

ప్రతి ఓటుకి ప్రాతినిధ్యం - దామాషా పద్ధతితోనే సాధ్యం

ధన రాజకీయం పోవాలి - జన రాజకీయం రావాలి

ప్రజలే ప్రభువులు - పాలకులు సేవకులే



సుపరిపాలన కోసం – అందరికీ ఎదిగే అవకాశాల కోసం

# సురాజ్యఉద్యమం

స్వరాజ్యం కాకూడదు  స్వాహారాజ్యం

– స్వరాజ్యం కావాలి సురాజ్యం

## స్వపరిపాలన కోసం “స్వరాజ్యం నాజన్మహక్కు”

– ఆనాటి నినాదం

## సుపరిపాలన కోసం “సురాజ్యం మన జన్మహక్కు

– ఈనాటి నినాదం